POSTAL REGD.NO.PRAKASAM/2026-2028
REGD.NO. APTEL/26/A0220
ESTABLISHED : 1983
జూన్ 2026
**వెల – ₹ 10.00**

# సాయిబాబా

## ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 44 సంచిక: 02




పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ తల్లి ఆరాధన
జూన్ 03, 2026

## ఈ నెల పండుగలు

జూన్ 03 - పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ తల్లి ఆరాధన

జూన్ 21 - శ్రీ చివటం అమ్మ ఆరాధన [జ్యేష్ఠ శుద్ధ సప్తమి]

జూన్ 29 - శ్రీ పాకలపాటి గురువుగారి జయంతి [జ్యేష్ఠ పౌర్ణిమ]



# సద్గురు శరణం తప్ప వేరే దారిలేదు

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

ఎంతోమంది ఎన్నో జపాలు, ధ్యానాలు, పారాయణలు, పూజలు చేస్తారు. కాని మనస్సు ధ్యానంలో ఏకాగ్రం కాలేదని వాపోతుంటారు! సలహాల కోసం ఎందరో పెద్దలను దర్శించి ప్రశ్నిస్తారు. ఒక దేవతను వదలి యింకొక దేవుణ్ణి, ఒక గురువును వదలి యింకొక గురువును, ఒక సాంప్రదాయాన్ని వదలి యింకొక సాంప్రదాయాన్ని ఆశ్రయిస్తూంటారు. కొంతకాలం ఆ క్రొత్తదనం వలన ప్రయోజన మున్నట్లనిపించినా, మరి కొంతకాలానికి వారి సమస్య సమస్యగానే నిలిచిపోతుంటుంది. వీరిలో కొందరు అసలు సాధన, ఆధ్యాత్మికతలే వాస్తవంకాదనే దృష్టికొస్తారు. అలానే ప్రాపంచిక సమస్యల విషయంలోనూ జరుగుతూంటుంది. ఈ సమస్యకు కారణం మనం ప్రధానమైన ఒక సత్యాన్ని మరవడమే.

ఇంద్రియాలకు, మనస్సుకు అతీతమైన పరమాత్మ ఉన్నాడనీ, తినడం, నిద్రపోవడంవంటి ప్రాకృతికమైన క్రియలకంటే జీవితానికి వేరొక పరమార్థమున్నదని, దానిని పొందేందుకు సాధన ఒకటున్నదనీ మానవజాతికి తెల్పినవారు లేకుంటే మనమంతా పశుప్రాయంగా జీవిస్తుండేవాళ్ళమే. అలా తెల్పినవారిని సద్గురువులంటారు. భగవంతుని అస్తిత్వాన్ని తాము ప్రత్యక్షంగా అనుభవించి, మనకు నిస్సంశయంగా ఆ విషయాన్ని నిరూపించి, దానిని పొందే మార్గాన్ని స్వానుభవంతో బోధించే వారిని 'సద్గురువులు' అంటారు. మన సనాతనమైన ఆధ్యాత్మిక సంపదయైన వేదాలు, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భగవద్గీత, భాగవతాది పురాణాలు యివన్నీ యిట్టి సద్గురువులైన ఋషులవలన మనకు సంక్రమించినాయి. మన ఆధ్యాత్మిక సంపదంతటికీ మూలం వారే. ఇలానే ప్రపంచంలోని మతాలన్నింటికీ అట్టివారే మూలపురుషులు.

ఏ విద్యనభ్యసించాలన్నా అందులో పూర్ణమైన అనుభవాన్ని గడించినవారి సహకారాన్నాశ్రయించాలి. బిడ్డ మాటలు నేర్వడం దగ్గరనుండీ, ఈత, వైద్యశాస్త్రాల నుండీ ఆధ్యాత్మవిద్య వరకూ యిదే మూలసూత్రం, వేదఋషులందరూ యిలా సద్గురుసేవలో తపశ్చర్యను సాధించి వేదద్రష్టలు కాగలిగారు. వశిష్ఠుడు, యాజ్ఞవల్క్యుడు, వేదవ్యాసుడు అందరూ అలాంటివారే. అంతేకాదు, పరమార్థసాధన కొరకు శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు అయిన గురువును ఆశ్రయించి తీరాలని ఉపనిషత్తులు చెబుతున్నాయి. అసలు అట్టి వారు మాత్రమే ఉపనిషత్తులు, భగవద్గీత వంటి ఉత్తమవిద్యను బోధించడానికర్హులని ఆ ప్రామాణిక గ్రంథాలే చెబుతున్నాయి. ఈ సూత్రాన్ని మరవడమే యింత ఆధ్యాత్మిక దృష్టికల ఈ దేశంలో యింతమందికి యీ వ్యాసారంభంలో ప్రస్తావించిన సమస్య లెదురువడానికి కారణం.

బ్రహ్మజ్ఞానియైన సద్గురువునాశ్రయించి తీరాలని లోకానికి అవతార పురుషులు నొక్కి చెప్పారు. మన

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:44 జూన్ - 2026 సంచిక:02

**పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన "సాయిబాబా"**

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | సద్గురు శరణం తప్ప వేరే దారిలేదు | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | పరిప్రశ్న | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 06 |
| 03. | సద్గురు మహిమ | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 07 |
| 04. | వార్తాలాపము | శ్రీమతి అడిదం వేదవతి | 11 |
| 05. | భగవాన్ శ్రీ భరద్వాజ | శ్రీమతి శ్రీదేవి | 13 |
| 06. | మాతృదేవి స్మృతులు | శ్రీ శివ కుమార్ | 14 |
| 07. | శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు | శ్రీమతి శ్రీదేవి | 17 |
| 08. | శ్రీ గురుచరిత్ర సప్తాహ సత్సంగ ప్రవచన యాత్ర (శ్రీ క్షేత గాణ్గాపురం) | శ్రీమతి టి. పద్మావతి | 19 |
| 09. | ముక్తి సాధనకు ముఖ్య సోపానాలు - నిష్ఠ, సబూరీ! -మాతృశ్రీ మాటలలో- | శ్రీమతి శ్రీదేవి | 22 |
| 10. | ద్వారకామాయి అనుభవమండపము | శ్రీమతి ఎల్లంరాజు వసంత | 25 |
| 11. | ఆచార్యుని అద్భుత లీలలు | స్వర్గీయ శ్యాంప్రసాద్ | 27 |


సలాభావం వల్ల ఈ సంచికలో, 'బుద్ధ ధ్యాన హృదయము' ప్రచురింపబడటం లేదు. – ఎడిటర్


చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Kondaiah Bunk Street, Kothapeta,
Ongole, Prakasam District, A.P. - 523002
Phone No. 08592 233271
**www.saibharadwaja.org**


చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

### చందా వివరములు

| | |
|---|---|
| విడి ప్రతి | : ₹10-00 |
| సంవత్సర చందా | : ₹100-00 |

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

మాచరించి తీరవలసిన మార్గాన్ని తన ఆచరణ ద్వారా చూపిన శ్రీరామచంద్రుడు విశ్వామిత్రుణ్ణి గురువుగా ఆశ్రయించాడు. తాను ఏవిధమైన యత్నంతోనూ పొందదగినదేదీ ముల్లోకాల్లోనూ లేదని భగవద్గీతలో చెప్పిన శ్రీకృష్ణ పరమాత్మ; బాల్యంలో తననోట చతుర్దశ భువనాలనూ, యశోదకు దర్శనమిచ్చిన శ్రీకృష్ణుడు సాందీపని మహర్షికి శిష్యుడై సేవించాడు. అందుకు కారణాన్ని భగవద్గీతలో "యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనాః", "శ్రేష్ఠుడు దేనినాచరించిన, దానినే యితర జనులాశ్రయిస్తారు(గనుక)" అని చెప్పాడు. తానాచరించి చూపడమేగాక ప్రాణప్రియుడైన అర్జునుడికి గూడా అలానే చేయమని చెబుతాడు:

**"తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా!**
**ఉపదేక్ష్యనితే జ్ఞానం జ్ఞానినః తత్త్వదర్శినః"**
(అధ్యా. 4: శ్లో.32)

భావము: "పరమాత్మ తత్వాన్ని ప్రత్యక్షానుభవంగా దర్శించిన జ్ఞానులను సేవించి, సాష్టాంగముగ నమస్కరించి, జ్ఞానము కలుగువరకూ చక్కగా ప్రశ్నించు. వారు నీకు జ్ఞానాన్ని బోధిస్తారు."

బాగా ఆలోచిస్తే యీశ్లోకమెంత ప్రధానమైనదో అర్థమవుతుంది. సకల ఉపనిషత్తుల సారమూ, బ్రహ్మవిద్య, సకల యోగసాంప్రదాయముల సారమూ అయిన యీ భగవద్గీత వెలువడడానికి కారణం బ్రహ్మవేత్తలలోను, యోగులలోను అగ్రేసరుడు, పూర్ణావతారమూ అయిన శ్రీకృష్ణుని అర్జునుడు, "శిష్యస్తేహం శాధిమాం త్వాం ప్రపన్నమ్", "నేను నీ శిష్యుడను, శరణుబొందిన నన్ను రక్షించు" అని ప్రణిపాతముచేసి, పరిప్రశ్న చేయడంవలనగదా గీత ఆవిర్భవించినది? అర్జునుడలా చేసే వరకూ కృష్ణుడు కేవలం సారథిగా మాత్రమే వ్యవహరించాడు! అంతేకాదు. అలా ఆశ్రయించదగిన వారెలా ఉండాలోగూడ భగవద్గీత సూచిస్తున్నది. శ్రీకృష్ణుడు తానే సకలభూత హృదయాంతర్వర్తినని, యీ విశ్వమెల్లా తన 'విభూతి', లేక మహిమయేననీ, చెప్పినపుడు నమ్మలేని అర్జునునికి విశ్వరూపాన్ని దర్శనమిచ్చి, విశ్వాసాన్ని పటిష్టం చేసాడు. అలా చేయగలవారినే గురువనదగియున్నదని దీని భావం. అంతేకాదు, అటువంటి సద్గురువు ప్రసాదించగల అనుభవ మెలాంటిది? శ్రీకృష్ణుడిలా చెప్పాడు: "నన్ను నీ వెలాచూచావో అట్టి దర్శనము వేదముల చేతగాని, యజ్ఞదాన తపస్సుల చేతగాని చూడ సాధ్యముగాదు." (అధ్యా.11 శ్లో.53). అందుకే ఉపనిషత్తులన్నీ ముముక్షువు ఆత్మజ్ఞానియైన సద్గురువునాశ్రయించాలని చెప్పాయి.

ఆధునికులైన మహనీయుల అనుభవంలోగూడ యిదే కనిపిస్తుంది. వివేకానందునికి రామకృష్ణుడు పాదస్పర్శ చేత ప్రసాదించిన దివ్యానుభూతి వంటిది సద్గురువులేకనే ఎవరైనా పొందినట్లు విన్నామా? రామకృష్ణ పరమహంస జగన్మాతయైన కాళికాదేవి సాక్షాత్కారాన్ని సాధించగలిగినా ఆత్మానుభూతిని పొందడానికి తోతాపురిని ఆశ్రయించమని ఆ దేవియే చెప్పినది. అలానే పండరి విఠలుని సగుణరూపాన్ని సాక్షాత్కరించుకొన్న నామదేవునితోగూడ నాగనాథ దేవాలయంలోని విశోబాకేశుడనే మహనీయుని ఆశ్రయించి పూర్ణజ్ఞానాన్ని పొందమని విఠలుడే ఆదేశించాడు గదా? బాహ్యాచారాలన్నింటినీ విమర్శించిన యోగివేమన కూడ సమర్థుడైన గురువు నాశ్రయించవలసినదని ఆదేశించాడు. ఏ గురువునూ ఆశ్రయించకనే జ్ఞానియైనట్లు కనిపించిన భగవాన్ రమణ మహర్షి గూడ, "నాకూ ఒక గురువున్నారు. అయితే మీరనుకొన్న విధంగా కాదు" అన్నట్లు 'రమణ దివ్యభాషణలు' (Talks with Bhagawan Ramana) అన్న గ్రంథంలో చూడవచ్చు.

సద్గురువునాశ్రయించని సాధన రక్తికట్టదనడానికి పరిపూర్ణుడైన సద్గురువు నాశ్రయించకనే జపపూజాదులు చేసే జన బాహుళ్యం యొక్క అనుభవము ఋజువు. అట్టి గురువునెలా గుర్తుపట్టాలో, ఆశ్రయించాలో బాబా చరిత్రలో చూడవచ్చు. ●

# పరిప్రశ్న

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

***ప్రశ్న :- 'ఆపద్బాంధవా,' 'శరణాగతవత్సలా' అనే నామాలను మననం చేసికొని, వ్రాసినంత మాత్రాన ఏమౌతుంది. లోకమంతా దీనివల్లనే మారిపోతుందని తమరి భావమా?***

***- ఎమ్.జనార్ధన శెట్టి, చెంగయ్య, సూళ్లూరుపేట***

**జవాబు :-** ఫలితం పొందాలంటే యత్నం కావాలి. యత్నం సరిగా జరగాలంటే సంకల్పం దృఢంగానూ, పరిశుద్ధంగానూ వుండాలి. కాని అంత మాత్రమే చూచుకుంటే మనమే కర్తలమన్న అహంకారము వస్తుంది. ఇది భక్తిని, సాధననూ చెడగొట్టి, రాగ-ద్వేష-అసూయాదులను పెంచి మనను కర్మబంధంలో చిక్కిస్తుంది. కనుక సత్సంకల్పాన్ని ఓరిమితోనూ, నిష్ఠతోనూ భగవంతునికి, ఆయన రూపమైన సద్గురువుకు నివేదించాలి. అపుడు శ్రేయస్కరమైనది తగిన సమయంలో సర్వజ్ఞుడు, సర్వసమర్థుడూ అయిన సద్గురువే నెరవేర్చేవారు అన్న ఎరుక మిగులుతుంది. అహంకారము, కర్మఫలంపట్ల అతి వ్యామోహము మొ॥న వికారాలు కల్గవు. అంతేగాక ఆయనకు నివేదించిన వంటకం లాగనే సంకల్పం గూడ పవిత్రము, శక్తివంతము అవుతుంది. పారాయణ, ప్రార్థనల వలన ఎందరికో కష్టాలూ, కోరికలూ వారి శ్రేయస్సుననుసరించి సాయి నెరవేర్చడం చూస్తున్నాము కదా? ఏనాడు దేశ శ్రేయస్సుకోసం మనమందరమూ కలసి చేసే సంకల్పము, ప్రార్థన చాలినంత బలీయమౌతాయో అపుడు పరిస్థితులలోనూ, మానవుడి భావాలలోను చిత్రమైన మార్పు వస్తుంది. కారణం భగవంతుడు, సద్గురువు అందరి హృదయాలలోను వ్యాపించియుంటాడు కదా?

అయితే మనం మోక్షాన్ని మనసా, వాచా కోరడమేగాక దానికి తగిన క్రియగూడ వివేకము, పట్టుదలలతో చేయాలి – డబ్బు, విద్య ఆర్జించ యత్నించినట్లే. అలానే పారాయణ, సాయిబోధలు మననం వలన మనం తెలిసికొనినదానిని ప్రక్కవారితో పంచుకోవాలి. దీనికితోడు మన సంస్కృతిని అర్థం చేసుకొని నేటి ప్రజలకు తెల్పి, వారికి దానిపై భక్తి కల్గించాలి. నేటి సమాజంలోని అవాంఛనీయమైన రీతులకు దేశభక్తి లోపించడము, సాటి భారతీయునిపట్ల ఆదరణ లేకుండడము, అందుకు అవివేకంతో పాశ్చాత్య నాగరికతను అనుకరించడము కారణాలు. అవి తొలగించే అంశాలను తెల్సుకొని వీరికి తెల్పాలి. ఇవన్నీ చేసే ఓపిక, పట్టుదల రావాలంటే సంకల్పము దృఢము, పరిశుద్ధము కావాలి. ఒకే సంకల్పాన్ని మళ్ళీ మళ్ళీ అవగాహనతో పటిష్టం చేసుకుంటే బలపడుతుందన్నది నిత్యానుభవము. అందుకే అట్టి సంకల్పంతో అందరమూ ప్రార్థనా పూర్వకంగా 'ఆపద్బాంధవా, శరణాగతవత్సలా' అన్న నామ లేఖనగా ఏకాగ్రతతో చేయడమెంతో ప్రధానము. మనం సమిష్టిగా చేసిన ఈ ప్రార్థన వలన భగవంతుడు ఆ సత్సంకల్పం నెరవేర్చగల మహనీయులను, కార్యదక్షులను అవతరింప చేస్తాడు. అందుకనే మన ప్రాచీన ప్రార్థన "సర్వేజనాస్సుఖినోభవంతు" అని ముగుస్తుంది. అలాంటి నిస్వార్థమైన సంకల్పంచేసి ప్రార్థించడం వలన మనలో నిస్వార్థము, సర్వభూత హిత కాంక్షలనే సత్త్వగుణాన్ని పెంచి మన సాధనను గూడ శక్తివంతము చేస్తుంది. పారాయణ, పైన చెప్పిన నామ లేఖనాలవలన తప్పక ప్రయోజనముంటుంది. ●

*(జూలై 2012 సాయిబాబా మాసపత్రిక నుండి)*

# సద్గురు మహిమ

***పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ***

సద్గురు మహిమగూర్చి వర్ణించనెవరితరమూ గాదని పెద్దలు చెబుతారు. అంటే గురు మహిమ మన ఊహకు అందనంతటి గొప్పది అని అర్థం.

అసలు 'గొప్పది' అంటే ఏమిటి? కరుణ వర్షించడంలోనా? కఠినంగా శిక్షించడంలోనా? మామూలుగా మనం గురుమహిమ గూర్చి చెప్పుకునేటప్పుడు కరుణ వర్షించడంలోనేనని అనుకుంటాము.

'గురుమహిమ' అంటే గురువు యొక్క చర్యలు అంతటి మహిమ గలవి అని అర్థం. సద్గురువు సకల చరాచర సృష్టినీ సృష్టించి, నిలిపి, లయమొనరుస్తాడు. అందుకని ఈ సృష్టి మొత్తం ఆయన మహిమా స్వరూపమే. ఒక కవి హృదయం పులకించినా, ఒక గాయకుని హృదయం పరవశించినా, ఒక తాత్వికుని హృదయం చింతన చేసినా, ఎందరు ఋషులు, మునులు, యోగులు తమ తపస్సుల ద్వారా ధ్యానించినా, ఎందరు వైజ్ఞానికులు పరిశోధనలు జరిపినా – వారు తెలుసుకునేది ఆయన మహిమాన్విత సృష్టిలో అణువంతమాత్రమే.

అలాగే స్థితి, లయములుగూడ ఆయన యొక్క మహిమా స్వరూపమే.

గురు మహిమ అతి చిత్రమైనది. పసి పిల్లవాడికి తాయిలం పెట్టినట్లు మనకు తాయిలాలుగా చిన్న చిన్న కోరికలు వెంటనే తీర్చి మనలను మురిపిస్తుంది. కొద్దిగా ఎదిగాక ఒక చెంపను ముద్దు పెట్టుకుంటూ మరొక చెంపను పగులకొడుతున్నట్లు కొన్ని కోరికలు తీరుస్తూ, కొన్నింటిని తీర్చక ఏడిపిస్తూ వుంటుంది. ఒక చెంప వాయిస్తున్నట్లు కొన్ని కష్టాలను తీర్చక, నేను లేననుకోవడానికి వీలులేనట్లు కొన్ని కోరికలు తీరుస్తూ, కాసేపు ఏడిపిస్తూ, కాసేపు నవ్విస్తూ తను తప్ప గతిలేనట్లు ప్రవర్తిస్తుంది. సాధనలో ఎదిగిన వాడికి అంటే యింకా బాగా తనను నమ్ముకున్నవాడికి వట్టి చెంపదెబ్బలు మాత్రమే గాదు, కొరడా ఝుళిపించడం గూడ చేస్తుంది. ముద్దులు, మిఠాయిలు ఏ మాత్రం వుండవు.

సద్గురువు మహిమ వెన్న వలె అతి మృదువైనది. అంతేగాదు, వజ్రం వలె అతి కఠినమైనది గూడ. అయితే ఎవరెవరి స్థాయిని బట్టి వారి వారి పట్ల అట్లా ప్రవర్తించడము, ప్రసాదించడము చేస్తుంది. అయితే ఎంత కఠినంగా వుంటుందో అంత శ్రేయస్సును చేకూరుస్తుంది.

అంతటి మహిమ గల సద్గురువు చేసిన కొన్ని లీలలను యిప్పుడు చెప్పుకుందాము.

సద్గురుని లీలలు చిత్రవిచిత్రములుగా వుంటాయి. ఆయన ఒక నిరుపేదవాడిని గొప్ప ధనవంతుడుగా చేస్తాడు. మరొకనిని నిష్ఠదరిద్రునిగా చేసి చూస్తూ వూరుకుంటాడు. ఒకరికి ప్రాణం పోస్తే, మరొకరిని(మన దృష్టిలో) నిర్దాక్షిణ్యంగా ప్రాణం తీస్తాడు.

చాకలివానికి సామ్రాజ్యమిస్తాడు. మూగవానిని వేదవేదాంగ పారంగతుని చేస్తాడు. గొడ్రాలికి సంతానం ప్రసాదిస్తాడు. ఇలా ఎందరికో ఎన్నో కోరికలు తీరుస్తాడు.

అయితే గురు మహిమకు మరోకోణం గూడ

వున్నది. అది రెండువైపులా పదునువున్న కత్తిలాగా పనిచేస్తుంది. గురువు ఒక ప్రక్క మధురమైన పండ్ల ముక్కలు కోసి పెట్టినట్లు మధురానుభవాలను ప్రసాదిస్తూనే మరొకవంక ఆపరేషన్ చేసినట్లు కష్టాలను గూడా ప్రసాదిస్తాడు. అయితే వైద్యుడు మన శరీరానికి పనికి రాని, హాని కలిగించేవాటిని తొలగించడానికి, సవరించడానికి ఆపరేషన్ చేసినట్లే సద్గురువు గూడ కష్టాలను అనుభవించేటట్లు చేసి, వెనుక తానుండి శ్రేయస్సును చేకూరుస్తాడు. వైద్యుడు మనకు ఆరోగ్యాన్ని ప్రసాదించినట్లే సద్గురువు పరమార్థాన్ని ప్రసాదిస్తాడు.

సమర్థ సద్గురువైన శ్రీ శిరిడీ సాయిబాబా పూజ్యశ్రీ మాస్టరుగారిని ప్రథమ దర్శనంలోనే అంతగా అనుగ్రహించి ఆయన ద్వారా తాము చేయదలుచుకున్న లోకకళ్యాణ కార్యక్రమాన్ని చేయించుకుంటున్నప్పటికీ, మరొకవైపు లౌకిక జీవితంలో ఆయనకు అనేక ఒడిదుడుకులను ప్రసాదించారు. నల్లేరు మీద నడకగాకుండా పల్లేరు కాయల మీద నడకగా సాగింది ఆయన జీవితం. అన్ని వైపులనుంచీ ఆయనకు ఎదురుగాలులే వీచాయి. తమను అడిగినవారికి, అడగనివారికీ గూడ వారి అవసరాలు గుర్తించి ఆర్థిక సహాయం అందించిన ఆయన ఆర్థికంగా ఎంతో యిబ్బంది పడవలసి వచ్చింది. సరియైన ఆధ్యాత్మికతను బోధించినందుకుగాను ఆధ్యాత్మికత అంటే సరిగా తెలియని వారందరి యొక్క ఎదురుదాడులను ఎదుర్కోవలసి వచ్చింది. ఇలా సత్యాన్ని బోధించిన ప్రతి విషయంలోనూ ఎదురుదాడులను ఎదుర్కొంటూ, ఎదురు బాటలోని ముళ్ళను ఏరివేసుకుంటూ ముందుకు సాగిపోయారాయన.

అయితే ఆయనను నమ్ముకుంటే కష్టాలను ఎదుర్కోవలసిందేనా? అన్నది ప్రశ్న. కానీ ఆయనను నమ్ముకోకపోతే కష్టాలను తొలగించుకోగలమా? అన్నది ఎదురు ప్రశ్న. అసలు తమను నమ్ముకున్నవారిని కష్టాలపాలు చేస్తారనడం లోకంలో పరిపాటి. అయితే వారిని నమ్ముకోవడమెందుకు? అందుకనే, "అంతగా వారిని నమ్ముకోకుండా కష్టాలు వచ్చినప్పుడు మాత్రమే వారిని ఆశ్రయిస్తే వాటిని వారు తొలగిస్తారు, లేకపోతే లేదు. అంతమాత్రం భక్తి మనకు చాలు, అంతకుమించి మనకు వద్దు, అవసరంలేదు గూడ. కారణం ఎంత ఎక్కువగా భక్తి వుంటే అంతగా కష్టాలు పడవలసి వస్తుంది" అని చాలా మంది పరిమితమైన భక్తితో సద్గురువులను ఆశ్రయిస్తూ వుంటారు.

అయితే నిజంగా సద్గురువు అలా ఎందుకు చేస్తాడు? దానిలో వున్న అంతరార్థమేమిటి? అంతగా కష్టాలు పెట్టినా భక్తులు వారిని వదులుకోకపోవడానికి కారణమేమిటి?

సద్గురుభక్తివలన తలకుమించిన కష్టాలు రాక తప్పవా?

జీవితంలో కష్టసుఖాలు రెండూ అనుభవించడం అన్ని జీవులకూ సమానమే. కానీ మానవుడు మాత్రం ఈ రెంటినీ పోల్చి చూచుకుని కష్టాలలోంచి బయటపడే ప్రయత్నం చేస్తాడు. అంటే మానవుని అభివృద్ధికి కష్టాలు ఒక కారణమని చెప్పవచ్చు. అట్టి కష్టాలే లేకుంటే మానవుడు అభివృద్ధి చెందటానికి కావలసిన ప్రయత్నం చేయడు. అంటే ఇటు లౌకికంగానూ, అటు పారమార్థికంగానూ కూడా జడుడుగా, స్తబ్ధుడుగా మిగిలి పోతాడు.

అంతేకాదు. శక్తికి మించి సద్గురువెన్నడూ ఆధ్యాత్మికతలోకి లాగజూడడని పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పేవారు. అంటే భక్తునికి వివేక వైరాగ్యాలు కలుగజేయడానికి, కర్మక్షాళన చేయడానికి అవసరమైన కష్టాలు ప్రసాదిస్తాడు సద్గురువు. అలా కాక పూర్వకర్మ వలన భరించలేనంతటి కష్టాలు వచ్చినపుడు తోడుండి రక్షిస్తాడు. అవసరమైతే అట్టి కర్మను తొలగిస్తాడు కూడా.

మనసుకు వివేకాన్ని, వైరాగ్యాన్ని, ధర్మంగా నడవడానికి కావలసిన మానసిక దారుఢ్యాన్ని, సాధనకు కావలసిన పట్టుదలను క్రమంగా మనకు కష్టాలు అలవరుస్తుంటాయి. అలానే జీవితానికి కావలసిన స్ఫూర్తిని, ఉత్సాహాన్ని సుఖాలు, సంతోషాలు మనకు

కలిగిస్తాయి. సద్గురువు తన భక్తునికి క్రమపద్ధతిన, తగురీతిన ఆ భక్తుని కర్మశేషాన్ని అనుసరించి, యిట్టివి ప్రసాదిస్తాడు.

ఈ విషయం సద్భక్తునికి మరువలేని సత్యంగా నిలుస్తుంది కనుక కష్టాలకు బెదరక, తన గురువు రక్షణను గుర్తుంచుకుని ధైర్యంతో, ఓర్పుతో, పట్టుదలతో వాటిని ఎదుర్కొంటాడు. తన కర్మ క్షాళనమవుతున్నందుకు సంతోషిస్తాడు. నేర్వవలసిన పాఠాలను నేర్చుకుంటాడు. తన జీవితంలోని కష్టసుఖాలు అన్నీ ఆ సద్గురు మహిమే అని గుర్తుంచుకుని పులకరిస్తుంటాడు. కష్టాలకు కృంగక, సుఖాలకు పొంగక సమత్వాన్ని సాధిస్తాడు.

కష్టాలు భక్తులకు, భక్తులు కానివారికీ గూడ వస్తాయి. అయితే వారు అనుభవించే తీరులోనే తేడా వుంటుంది. భక్తులు వాటిని అంతగా పట్టించుకోరు. జీవితంలో కష్టసుఖాలు వస్తుంటాయి పోతుంటాయి, అవి సహజమేనని భావిస్తారు. చేయవలసినది భగవంతుని స్మరణ, శరణాగతి మాత్రమేనని, ఆయనకు నచ్చినట్లు కర్తవ్యాన్ని నిర్వర్తించడమేననీ తలుస్తారు. లేక అవి సద్గురువు తమకు పెట్టే పరీక్షలని తలుస్తారు. లేక వాటిని ప్రసాదాలని గూడ తలచవచ్చు. అందుకే వాటికి వారు కృంగరు. శాంతితో వుంటారు.

భక్తులు గానివారు, అంటే సామాన్యులు, కష్టాలు వచ్చినప్పుడు బాధపడుతూ వాటికి కారణమైన పరిస్థితులను, వ్యక్తులను తిట్టుకుంటూ, ఇతరులకు, తమకూ అశాంతిని కలుగజేసుకుంటారు. ఇటువంటి భావాలవలన అవి యింకా యింకా పెరిగి సంస్కారాలు బలపడి నిరంతరం అశాంతిపూర్వకమైన ఆలోచనలలో సతమతమవుతుంటారు.

ఉదాహరణకు ఆర్థిక ఇబ్బందులు, ఆరోగ్య పరిస్థితులు, చదువు, ఉద్యోగ సమస్యలు మాత్రమే గాక ఉదయం లేచింది మొదలు వారిట్లా వున్నారనో, వీరిట్లా అన్నారనో, లేక వారిట్లా చేసారనో అనుకుంటూ శాంతిని కోల్పోతుంటారు. ఇవి మాత్రమేగాక హోదా, అంతస్థు, పరువుప్రతిష్టలు, మర్యాదలు – వీటన్నిటినీ ఆధారం చేసుకుని వాటిని నిలుపుకోవడానికి శతవిధాలుగా ప్రయత్నించడంలో అశాంతిని కొనితెచ్చుకుంటారు. అతి చిన్న విషయాలు గూడ అతి పెద్ద విషయాలుగా వాళ్లను బాధపెడుతుంటాయి. ఉదాహరణకు ఒకరు తమను పలుకరించలేదనో, నమస్కరించలేదనో, కూర్చోమనలేదనో, తినడానికీ, త్రాగడానికి ఏమీ అడుగలేదనో ఇలాంటి వాటిని భూతద్దంలోనుంచి చూస్తూ శాంతిని కోల్పోతారు. జీవితాంతము వాటిని తలచుకుని వాపోతుంటారు గూడ.

కానీ నిజమైన భక్తులకు యివేవీ పట్టవు. పట్టకూడదు గూడ. వారు ఇటువంటి వాటిని చాలా అల్పవిషయాలుగా తలుస్తారు. వారు మర్యాదల కోసము, పొగడ్తల కోసమూ వెంపర్లాడరు. ఇవన్నీ వున్నా లేకపోయినా ఒకటిగానే భావిస్తారు. వాళ్ళకసలవి పట్టవు గూడ. అలాగని వాళ్ళు తమ కర్తవ్యాన్ని నిర్లక్ష్యం చేయరు. నిస్వార్థంగా, తమ కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తిస్తారు.

నిజమైన భక్తులు ఎల్లప్పుడూ తృప్తితో వుంటారు. వారు పస్తులుండవలసి వచ్చినా బాధపడరు. దీనికి ఉదాహరణ బాబా చరిత్రలోని మహల్సాపతి, శ్రీ గురుచరిత్రలోని యాయవారవృత్తిలో జీవించే నిరుపేద బ్రాహ్మణుడు. అలాగే సాఠేకు శిరిడీ గ్రామంలో వచ్చిన వ్యతిరేకత వల్ల బాబాను దర్శించడానికి వీలుపడక పోయినా అతడు బాధపడలేదు. బాబా తన శ్రేయస్సుకే అలా చేసారని భావించి తాను వున్నచోటనే బాబా సేవ చేసుకున్నాడు. అలాగే దీపకుడు మొ॥న శిష్యులను గురువు ఎలా బాధలు పెట్టారో గురుచరిత్రలో చూడవచ్చు.

అంటే నిజంగా సద్గురువును విడువక ఆశ్రయిస్తే, మనకు కనిపించే కష్టాలు వాళ్ళకు కష్టాలుగా అనిపించవన్నమాట. అంటే ఆయన ప్రసాదించే శాంతి ముందు యివి అత్యల్పాలన్నమాట. ఎంతవున్నా యింకా లేదనే కొరత, ఎన్నిసార్లు మనకిష్టమైనవి తిన్నా యింకా యింకా తినాలనే కోరిక, ఎంతగా సుఖాలను అనుభవిస్తున్నా యింకా యింకా అనుభవించాలన్న తపన – ఇవేవీ వారికి వుండవన్నమాట.



అంటే మనకు ఎంతో యిష్టమైన పదార్థం కడుపునిండా తిన్నప్పుడు కలిగే తాత్కాలికమైన తృప్తి, మనం కోరుకున్న సుఖాలను అనుభవిస్తున్నప్పుడు వుండే తాత్కాలిక సంతోషము; వారికి ఎప్పుడూ వుంటాయన్నమాట! ఒక్కమాటలో చెప్పాలంటే, ప్రపంచంలోని మానవజాతి అంతా దేనికోసమైతే ప్రాకులాడుతూ దానిని పొందలేకపోతున్నదో అట్టిదానిని భక్తునికి ప్రసాదిస్తాడు సద్గురువు. అట్టి అపారమైన, అంతులేని తృప్తి శాంతులను ప్రసాదిస్తాడు గనుకనే సద్గురువును సద్భక్తులు విడువరు, విడువలేరు గూడ.

అంతేగాదు, అట్టి సద్భక్తుని సద్గురువు తనంతటివానిగా గూడా చేస్తాడు. అట్టి వారిని ఆశ్రయించి మరెందరో ఐహిక, ఆముష్మిక సుఖాలను పొందుతారు. ఇక్కడ విచిత్రమేమిటంటే అట్టివారినే మనము గూడ కోరికలు తీర్చుకోవడానికి ఆశ్రయిస్తాము. మరి ఆయన అంతగా కష్టాలనే ప్రసాదించేవాడే అయితే అట్లా అనుభవించేవారినే మనము ఎందుకు ఆశ్రయిస్తున్నాము? వాళ్ళ దగ్గర శాంతి సౌఖ్యాలను ఎందుకు పొందగలుగుతున్నాము? మన కోరికలను ఎలా తీర్చుకోగలుగుతున్నాము?

ఇందుకు ఉదాహరణ పూజ్యశ్రీ మాస్టరుగారు. ఆయనకు ఆత్మానుభూతిని ప్రసాదించి తనంతటివారుగా చేసారు బాబా. తద్వారా కొన్ని కోట్లమందికి ఈనాడు శ్రేయస్సు చేకూరుస్తున్నారు. పూజ్యశ్రీ మాస్టరుగారు అనేక విధాలుగా చేసిన సద్గురు సాయి తత్త్వ ప్రచారం వలన కొందరు చిన్న పెద్ద కోరికలు తీర్చుకుంటుంటే, కొందరు ఇహపర శ్రేయస్సును పొందుతున్నారు. కొందరు పరమైన తత్త్వాన్నే పొందుతున్నారు. అట్టి అద్భుతమైనది గురుమహిమ.

నిజంగానే అట్టి గురుమహిమను కొనియాడడం ఎవరి తరము? ఇప్పుడు ఆలోచిస్తే తెలుస్తుంది– గురుమహిమ కష్టాలను ప్రసాదిస్తుందా? జన్మనెత్తిన తర్వాత కష్టసుఖాలు ఎలాగూ తప్పవు. నిజభక్తునికి అవన్నీ నీటిమీద వ్రాసిన గీతలలాగా జీవితంలో వచ్చి వెళ్ళిపోతుంటాయి. కానీ అంతులేని తృప్తి శాంతులతో అతడు ఆనందాన్ని అనుభవిస్తుంటాడు. అంతకంటే ఎవరికైనా కావలసినది ఏమున్నది?

ఈ కృతజ్ఞతా మహోత్సవ సందర్భంగా అట్టి అచంచలమైన గురుభక్తిని ప్రసాదించమని, ఈ గురుపూర్ణిమ నుంచి అయినా అట్టి గురుభక్తిని అలవరచుకునే శక్తిని అనుగ్రహించమనీ సద్గురు శ్రీ సాయినాథుని స్వరూపమైన పూజ్యశ్రీ మాస్టరుగారిని మనసారా ప్రార్థిద్దాము.

జై సాయి మాస్టర్!

# వార్తాలాపము

( గత సంచిక తరువాయి)

**శ్రీమతి అడిదం వేదవతి**

***శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.***

## 16వ ప్రసంగము

### నాస్తిక్యమ్

**శ్లో॥ అనాది సిద్ధసంసారః**
**కర్తృకర్మ వివర్జితః।**
**స్వయం ప్రాదుర్భవత్యేవ**
**స్వయమేవ విలీయతే॥**

భావం: 'ఈ ప్రపంచము అనాదిసిద్ధమైనది – అంటే అనాది నుండి ఇలానే వున్నది. దీనిని రచించినవాడు లేడు. రచన జరుగలేదు. అంటే ఈ జగత్తును సృష్టించిన సృష్టికర్త అయిన భగవంతుడు ఎవ్వడూ లేడు. ఇది స్వయంగా ఉద్భవించింది. ఇది స్వయంగా లయమవుతుంది' అని నాస్తికులు భావిస్తారు.

కానీ నైయాయికులు మాత్రము జగత్తును సృష్టించినది ఈశ్వరుడని అంగీకరిస్తారు. **'క్షిత్యంకురాదికం కర్తృజన్యం, కార్యత్వాత్, ఘటవత్'** ఘటాదులు (కుండ మొ॥వి) కుమ్మరి చేత చేయబడ్డాయి. అలాగే భూమి మొ॥వి కూడ ఒక కర్త చేతనే సృష్టింపబడ్డాయి. కానీ ఆ కర్త సామాన్య మానవుడు కాదు. సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు అయిన ఆ దైవమే జగత్తుకు కర్త' అని నైయాయికులు భావిస్తారు. జగత్కర్త ఈశ్వరుడు. జగత్తును సృష్టించడమనే కార్యము ఆయన చేసే కర్మ. ఈ సిద్ధాంతానికి విరుద్ధంగా చార్వాకులైన నాస్తికులు జగత్తును సృష్టించే కర్త ఎవరూ లేరు. అతడు చేసే కర్మ కూడా ఏదీ లేదు అని చెపుతారు. జగత్తు స్వభావసిద్ధమైనది. ఉత్పత్తి లయాలు స్వాభావికంగా జరిగిపోతాయి. విత్తనము నుండి చెట్టు, చెట్టు నుండి విత్తనము ఉద్భవించినట్లుగానే అంతా స్వభావసిద్ధంగా జరుగుతుంది. స్వాభావికంగానే ఉత్పత్తి లయాలు జరుగుతాయి, వాటిని చేసే వారెవరూ లేరు అనేది వారి వాదన. అంతేకాదు,

శ్లో॥ న స్వర్గో నాపవర్గో వా
నైవాత్మా పారలౌకికః।
నైవ వర్ణాశ్రమాదీనాం
క్రియాశ్చ ఫలదాయికాః॥

భావం: స్వర్గంలేదు, మోక్షం లేదు, పరలోకానికి ఆత్మ వెళ్ళదు. వర్ణాశ్రమ ధర్మాలను పాటించడం వల్ల ఫలం లేదు – ఈ విధంగా నాస్తికులు భావిస్తారు.

ఈ జగత్తును స్వభావసిద్ధంగా భావించే నాస్తికుల సిద్ధాంతాన్ని అనుసరించి అపూర్వమైన సుఖం కలుగుతుంది. కానీ స్వర్గము లేదు. మోక్షము లేదు. వాటి కోసం యమ, నియమాలను పాటించడం గాని, గురువుల నుండి శ్రవణ, మనన, నిధిధ్యాసనములను గానీ నేర్చుకోవడము అక్కరలేదు. పారలౌకిక సుఖము లేదు. పునర్జన్మ లేదు. కనుక వేదవిహితములైన కర్మలను ఆచరించవలసిన అవసరము మాత్రమేది? వర్ణాశ్రమధర్మాలను పాటించడం వలన పరలోకంలో అపూర్వమైన సుఖము కలుగదు. ఎందుకంటే, ధర్మఫలము జన్మాంతరములోనే అంటే పరలోకంలోనే లభిస్తుంది. అందుకే వర్ణాశ్రమధర్మాలను అనుష్ఠించాలి. ఆ పరలోకమే లేనప్పుడు, జన్మాంతరమే లేనప్పుడు ధర్మాన్ని అనుష్ఠించడం మట్టిలో నేయి పోయడం మాత్రమే.

శ్లో॥ అగ్నిహోత్రం త్రయో
వేదాస్త్రిదండం భస్మగుంఠనమ్।
ప్రజ్ఞాపౌరుషహీనానాం
జీవికేతి బృహస్పతిః॥

భావం: అగ్నిహోత్రము, మూడు వేదాలు, త్రిదండము, భస్మధారణ – ఇవి అన్ని బుద్ధిహీనులకు – అనగా సంపాదించేశక్తి లేనివారికి రోజు గడుపుకోడానికి సంపాదనామార్గాలు – అని చార్వాకమతం వాడైన బృహస్పతి చెప్పెను.

తాను ఆస్తికుడిననే గర్వముకల వైదికుడు మూర్ఖుడైతే తన రోజు గడుపుకునే శక్తి లేక, తన పొట్ట నింపుకోడానికి అగ్నిహోత్రంలో ధర్మభ్రాంతిని కలుగజేసి, ఆ ధర్మసహాయంతో తన కడుపు నింపుకుంటాడు. అగ్నిహోత్రము మొ॥న కర్మల గురించి వేదము ఇలా ఆజ్ఞాపిస్తోంది – **'యావజ్జీవేత్ తావదాగ్నిహోత్రం జుహూయాత్'** అంటే, 'బ్రతికి వున్నంతకాలము అగ్నిహోత్రాన్ని ఆచరించాలి. ఇటువంటి అగ్నిహోత్ర అనుష్ఠానం వలన, తనను ధర్మనిష్ఠ కలవానిగా ప్రజల చేత కీర్తింపచేసికొని, ప్రజల మన్ననలను పొంది, ధనము మొ॥న వాటిని సంపాదించేవాడు ఇంద్రియలోలుడు. ఆ అగ్నిహోత్రానుష్ఠానం చేసేవాడు తనను తాను రక్షించుకొనలేడు. ఎందుకంటే అగ్నిహోత్రం నుంచి పుట్టిన అపూర్వము ద్వారా స్వర్గము మొ॥న ఫలితాలు లభించనప్పుడు అగ్నిహోత్రము వలన ప్రయోజనం లేదు.

అలాగే ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదాలను తన జీవిత నిర్వహణకు ఉపాయాలుగా తలచేవాడు – అంటే వాటి మహిమను ఆధారంగా తీసుకుని రోజులు గడుపుకునేవాడు కూడా అటువంటివాడే! ఆ ఉద్దేశంతో వేదాలను చదివినా, స్వాధ్యాయము (తాను చదువుకున్నది) చెప్పినా, చెప్పించినా, ఉపన్యాసం చెప్పినా ఒకటే! అలాగే ఏక దండులు (ఒక దండము కలవారు) త్రిదండులు (మూడు దండములు కలవారు) అయిన సన్యాసులు కూడా కడుపునింపుకోడానికి యతి రూపంలో తిరుగుతుంటారు. ప్రజల పూజలు అందుకుంటారు. యతులకు నియమించబడిన సంయమము మొ॥న వాటివలన లభించే ఫలము జన్మజన్మలకూ అనుభవించవలసివున్నది. అలా కాకపోతే సన్యసించడం వలన ప్రయోజనం లేదు. కేవలము పొట్టనింపుకోడానికి మాత్రమే ఎంతోమంది సన్యాసాశ్రమాన్ని తీసుకుంటున్నారు. అలాగే మరికొంతమంది. భస్మము మొ॥న వాటిని ధరించి తమంతటి మహాత్ములు మరొకరు లేరని ఋజువు చేయాలనుకుంటారు. మరికొంతమంది పంచాగ్నుల

*మిగతా 24వ పేజీలో*

(గత సంచిక తరువాయి)

# భగవాన్ శ్రీ భరద్వాజ

**శ్రీమతి శ్రీదేవి**

## అధ్యాయం - 7

భరద్వాజగారు 1980 నవంబరులో మళ్ళీ అమ్మ దర్శనార్థం వెళ్ళి ఆమె సన్నిధిలో మూడు రోజులున్నారు. మాస్టరుగారి రాకను ముందుగానే తెలుసుకున్న అమ్మ ఆనందానికి అవధుల్లేవు. "బాబు వస్తున్నాడే! బాబు వస్తున్నాడు" అంటూ ఎంతో హడావిడి చేశారు. తమ కుటీరానికీ, రామాలయానికీ సున్నాలు వేయించి, కుటీరాన్ని శుభ్రంగా అలికించి ముగ్గులు పెట్టించి మాస్టరుగారు వచ్చే సమయానికి పెద్ద హండాలలో స్నానానికని నీళ్ళు కాయించి వుంచారు. పిండి వంటలతో భోజనం చేయించారు. అమ్మ ఎంతగానో అభిమానిస్తున్న మాస్టరుగారు వస్తున్నారని ఊరి వారంతా కూడా సంతోషంలో మునిగిపోయారు. ఆనాడు ఊరంతా పండుగ వాతావరణం నెలకొన్నది. ఆ రోజు మాస్టరుగారు వచ్చాక అమ్మ ఆయనకు అన్నం కలిపి ముద్దలు నోట్లో పెట్టి తినిపించారు. ఆమె కూడా కొంత తింటూ భరద్వాజగారికి నోట్లో పెట్టసాగారు. ఎంతో కాలానికి వచ్చిన కన్న కొడుకును చూసినట్లు అమ్మ ప్రవర్తించారు. ఆ దృశ్యాలన్నీ చూస్తూ ఊరివారంతా పరమానంద భరితులైనారు. ఆ మర్నాడు మాస్టరుగారు అమ్మకు పూజ చేశారు.

ఊరిలో భరద్వాజగారు ఆ మూడు రోజులు అమ్మ గురించి ఉపన్యసించి ఆమె మహిమను కొనియాడారు. ఆమెను భక్తితో ఎలా సేవించుకొనాలో అందరికీ తెలియజెప్పారు.

భరద్వాజగారు తమ శిష్యులందరినీ అమ్మ దర్శనానికై పంపేవారు. అమ్మ మాస్టరుగారి వద్దనుండి వచ్చిన భక్తులను ప్రత్యేకంగా ఆదరించేవారు. వారి కోసం భిక్ష తెప్పించి స్వయంగా తామే ముద్దలు కలిపి పెట్టి కడుపునిండా తినిపించేవారు.

పూజ్యశ్రీ మాస్టరుగారు విద్యానగర్ లో నిర్మిస్తున్న శ్రీ శిరిడీ సాయిబాబా మందిరానికి అమ్మ తమ ఆశీస్సులిచ్చి, ₹116-00లు విరాళంగా పంపారు. మందిర కుంభాభిషేక మహోత్సవానికి తమ భక్తులను పంపారు.

ఒకసారి శ్రీమాస్టరుగారు కుటుంబ సమేతంగా అమ్మను దర్శించినపుడు ఆమె అలివేలుమంగమ్మగారినీ, పాప వేదవతినీ ఎంతో ప్రేమ, వాత్సల్యాలతో ఆదరించారు. పాపకిష్టమైన వంటకాలను వండించి తినిపించారు. అమ్మ తమ భక్తులతో భరద్వాజగారి గురించి ఎంతో గొప్పగా చెపుతుండేవారు. 1981వ సంవత్సరంలో శ్రీ భరద్వాజ మాస్టరుగారి కుమారుడు చి॥ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ జన్మించబోయే ముందు శ్రీ చివటం అమ్మ శ్రీ మాస్టరుగారి గురించి, బాబు గురించి అక్కడ వున్న శిష్యరాండ్లతో "వ్యాసుడికి శుకుడు పుట్టినట్లేనే" అన్నారు సంతోషంగా. గర్భవతిగా వున్న అలివేలుమంగమ్మగారికి చీరె, చలిమిడి, పండ్లు, పువ్వులు పంపి, పుట్టబోయే బాబుకు అమ్మ తమ దివ్యాశీస్సులనందించారు.

**- సశేషం**

# మాతృదేవి స్మృతులు

**శ్రీ శివ కుమార్, బెంగళూరు**

బెంగళూరు వాస్తవ్యులైన శ్రీ శివకుమార్ గారు పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి అనుగ్రహ విశేషాలు వారి జీవితాన్ని ఎంతగా ప్రభావితం చేశాయో, అడుగడుగునా తనను రక్షిస్తూ ఆధ్యాత్మిక మార్గంలో నడిపించిన తీరును ఎంతో భక్తిపూర్వకంగా, హృదయానికి హత్తుకునేలా ఈ విధంగా తెలియజేస్తున్నారు.

## అమ్మగారితో మొదటి పరిచయం - వారి అనుగ్రహం

మొట్టమొదట పూజ్యశ్రీ అమ్మగారిని 2008-09 ప్రాంతంలో నాగోలు లో దర్శించుకున్నాను. వారిని చూడగానే 'మా అమ్మ' అన్న భావన కలిగింది. ఎందుకంటే మా అమ్మ కట్టుబొట్టు పద్ధతి అంతా అలివేలు మంగమ్మ తల్లిని పోలి ఉంటుంది. అందువల్ల అమిత ఆనందంతో నమస్కారం చేసుకొని, పూజ్యశ్రీ అమ్మగారితో, 'అమ్మా! నేను వుంటున్న బెంగుళూరులో మా ఇంటికి కొద్ది దూరంలో సాయిబాబా మందిరం నిర్మిస్తున్నారు, మీ చేతితో ఒక రూపాయి దక్షిణ ఇస్తారా!' అని అడిగాను. పూజ్యశ్రీ అమ్మగారు చిన్నగా నవ్వి, "అలాగే ఆ పక్కన నుంచోండి" అని చెప్పారు. మేము ఒకపక్కకి గోడకి ఆనుకుని నిల్చున్నాము. సత్సంగానికి వచ్చిన వారందరూ, వరుసగా ఒకొక్కరే పూజ్యశ్రీ అమ్మగారికి నమస్కారం చేసుకుంటున్నారు. ఒక పదినిముషాలు అయ్యాక నాకు, పూజ్యశ్రీ అమ్మగారు మర్చిపోయారేమో అనిపించి, కొంచెం ముందుకువెళ్ళి,'అమ్మగారు' అన్నాను నా వైపు చూసి మళ్ళీ చిన్నగా నవ్వి తల ఊపారు. అందరి నమస్కారాలు అయిపోయిన తర్వాత, లోపలి నుంచి కొత్త జేబురుమాలు తెప్పించి వచ్చిన దక్షిణ అంతా అందులో వేసి కట్టి నాకిచ్చారు. ఒక్క రూపాయి అడిగితే అంత దక్షిణ ఇచ్చారని నేను ఆశ్చర్యపోయాను. మేము కడుతున్నగుడిలో బాబా విగ్రహానికి ముందర సమాధి కట్టుబడిలో కొన్ని సాలిగ్రామాలు, గ్రంథాలతోపాటు అమ్మగారు ఇచ్చిన దక్షిణ కూడా అందులో నిక్షిప్తం చేసాము. వాటన్నిటికీ ఈనాటికి ప్రతిరోజు అభిషేకం జరుగుతూనే ఉంది. ఇది పూజ్యశ్రీ అమ్మగారితో నా మొట్టమొదటి అనుభవం!

## అనువాద సేవ - అమ్మగారి మార్గదర్శకత్వం

తర్వాత 2009లో మొట్టమొదటిగా వేరెవరో కన్నడలో అనువదించిన 'స్వామి సమర్థ' గ్రంథాన్ని ఒకసారి నన్ను సరి చూడమని ఆదేశించారు. కొన్ని చిన్న చిన్న మార్పులతో దాన్ని మళ్ళీ సరి చేయడం జరిగింది. ఆ తర్వాత 'శ్రీ సాయినాథ ప్రబోధామృతం' గ్రంథం కూడా వేరెవరో తెలుగు నించి అనువాదం చేసింది సరి చూడమని పంపించారు. అందులో చాలా తేడా వున్నట్లు నాకు అనిపించింది. ఆ గ్రంథంలో మాస్టరుగారి హృదయం ఆవిష్కరింపబడిందని నాకు అనిపిస్తుంది. కానీ అక్కడ ఆ భావ ప్రకటన సరిగ్గా జరగలేదనిపించి, ఆ విషయాన్ని విన్నవించాను. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు శ్రీ సాయినాథ ప్రబోధామృతం గ్రంథం మొత్తం

నన్నే కన్నడ భాష లోకి అనువాదం చేయమన్నారు. నేను ఆశ్చర్యపోయాను. ఎందుకంటే, నేను తెలుగు చదవగలను, అర్థం చేసుకోగలను, కానీ భాషపై పూర్తి పట్టులేదు. మరి నాకెందుకు ఈ సేవ ఇచ్చారో అనుకునేవాణ్ణి. అయితే నా మిత్రులందరికీ తెలుగు బాగా తెలుసు. కొంత వాళ్ళ సహకారం తీసుకున్నాను.

కొంత అని ఎందుకు అన్నానంటే దీంట్లో పూర్తి సహకారం పూజ్యశ్రీ అమ్మగారిదే. అదెలాగో వివరిస్తాను. పూజ్యశ్రీ అమ్మగారి ఆజ్ఞ మేరకు శ్రీ సాయినాథ ప్రబోధామృతం అనువాదం మొదలు పెట్టాను. “సదానింబ వృక్షస్య” అనే మొదటి శ్లోకం అనువాదానికే నాకు 15 రోజులు పట్టింది. ఒకరోజు పూజ్యశ్రీ అమ్మగారి నించి ఒక సందేశం వచ్చింది. అదేమిటంటే – శ్రీ సాయినాథ ప్రబోధామృతం గ్రంథం తరువాత అనువాదం చేయవచ్చు. బాబాకి క్షమాపణలు చెప్పుకుని దానిని పక్కనపెట్టి, దానికంటే ముందు ‘మిలారేపా’ గ్రంథము ఒక నెలరోజుల్లో అనువాదం చెయ్యాలని చెప్పారట. ఆ సందేశం నా మిత్రులు ప్రసాద్ గారిద్వారా నాకు చేరింది. సరే పూజ్యశ్రీ అమ్మగారి ఆదేశం మేరకు మిలారేపా గ్రంథం మొదలు పెడదామని అనుకున్నాను. కానీ అంతంత మాత్రంగా తెలుగు వచ్చిన నాకు, ఒక నెల రోజుల్లో పూర్తిచేయాలంటే భయమేసింది. అప్పుడు నేను అమ్మగారికి ఒక విన్నపం చేసుకున్నాను ఏమనంటే – ‘నీతో నేనుంటాను, నేను చేయిస్తాను అని పూజ్యశ్రీ అమ్మగారు నాకు హామీ ఇస్తే తప్పకుండా మొదలు పెడతాను’ అని పూజ్యశ్రీ అమ్మగారికి ఒక అర్జీ పెట్టుకున్నాను. దాదాపు నెలా పదిహేను రోజులు దాటిన తర్వాత ఒకరోజు సాయంత్రం ప్రసాద్ గారు నా దగ్గరకు వచ్చి, ‘శివగారు, ఈరోజు నించి మిలారేపా గ్రంథాన్ని మొదలుపెట్టుకోమని పూజ్యశ్రీ అమ్మగారు చెప్పారట’ అని చెప్పారు. ‘హమ్మయ్య ఇన్ని రోజులకు నన్ను అమ్మ అనుగ్రహించారు, ఇక నుండి అమ్మ నాతోనే ఉండి ఈ గ్రంథాన్ని రాయిస్తారు’ అని ధైర్యంగా ఉత్సాహంగా ఆ గ్రంథాన్ని అనువదించడం మొదలుపెట్టాను. నాకే ఆశ్చర్యం కలిగించేలా చాలా ఆనందంగా, ప్రశాంతంగా గ్రంథం అనువాదం జరిగింది. ప్రతిరోజూ రాత్రి 10గంటలకి అనువాదానికి కూర్చుంటే రాత్రి 2,3 కూడా అయ్యేది. అలసటకానీ నిద్ర కానీ ఏమీ ఉండేవి కావు. మామూలుగా అయితే మరునాడు లేవడం కష్టమవుతుంది. అప్పుడు నేను శ్రీవెంకటేశ్వర స్వామి గుడిలో అర్చకత్వం చేసేవాడిని, కనక ఉదయమే లేచి గుడికి వెళ్ళాలి. అయినా నాకేమీ అలసట ఉండేదికాదు. ఇదంతా అలివేలుమంగమ్మ తల్లి సహకారం కాక ఇంకేమిటి? నిర్ణీత సమయానికే గ్రంథం పూర్తయింది.

ప్రతి మంగళవారం సాయంత్రం 6.30 గంటలకి, నేను అర్చకత్వం చేసే వెంకటేశ్వరస్వామి గుళ్ళో సాయి మాస్టర్ సత్సంగం చేసుకునే వాళ్ళం. అదేవిధంగా అమ్మగారు సెలవిచ్చిన కొన్ని రోజులకి గ్రంథం సరిగ్గా మంగళవారం నాడు పూర్తయి, సత్సంగానికి బయలుదేరుదాం అనుకుంటున్న సమయంలో, ప్రసాద్ గారు వచ్చి, ‘శివ గారు! మిలారేపా గ్రంథం ఎంతవరకు వచ్చింది’ అని పూజ్యశ్రీ అమ్మగారు అడగమన్నారట’ అని అడిగారు.. ఈ గ్రంథం మొదలుపెట్టిన దగ్గర నుంచి ఇప్పటివరకు పూజ్యశ్రీ అమ్మగారు నుంచి ‘ఎంతవరకు వచ్చింది’ అన్న ప్రశ్న రాలేదు. సరిగ్గా గ్రంథం పూర్తవ్వడం పూజ్యశ్రీ అమ్మగారు అడగడం జరిగింది. అందువల్ల ఈ అనువాదాన్ని పూజ్యశ్రీ అమ్మగారే నా చేయిపట్టి వ్రాయించారు అనడంలో ఎటువంటి సందేహం లేదు.

## అపార కరుణ-ప్రాణాపాయం నుంచి రక్షణ

దాని తర్వాత శ్రీ సాయినాథ ప్రబోధామృతం అనువాదం మొదలుపెట్టాను. 2013 October 13కి ఆ గ్రంథం పూర్తయింది. అయితే నా మనసులో చిన్న ఆశ కలిగింది, ఏమంటే ఈ గ్రంథం ఆవిష్కరణ రోజు నేను వెళ్ళి, పూజ్యశ్రీ అమ్మగారి హస్తముల నుంచి ఆ గ్రంథ ప్రతిని తీసుకోవాలి అనే ఆశ కలిగింది. సరే వారు తేదీ నిర్ణయించి కబురు పెట్టగానే బయలుదేరుదాం అని సిద్ధంగా ఉన్నాము. రెండు రోజుల ముందు ఆవిష్కరణ

తేదీ మాకు తెలియజేశారు. అప్పుడు మేము నలుగురం కలిసి వెళ్లాలని నిర్ణయించుకున్నాం. కానీ టికెట్లు దొరకలేదు. ప్రైవేట్ ట్రావెల్స్ లో చూస్తే జబ్బర్ ట్రావెల్స్ లో ఒక బస్సు దొరికింది. దాన్లో మేము నలుగురికి టిక్కెట్లు అడిగితే, ఇద్దరికి మాత్రమే సీట్లు ఉన్నాయి అని చెప్పారు. ముగ్గురైనా వెడదామనుకున్నాం. ఇద్దరు అనేసరికి ఆగిపోయాం. కానీ నా మనసులో మాత్రం నాగోలు వెళ్ళి, స్వయంగా పూజ్యశ్రీ అమ్మగారి చేతుల మీద గ్రంథం తీసుకోలేకపోయానే అని బాధగానే ఉంది. మరునాడు సాయంత్రం అలా వ్యాహ్యాళికి వెళుతూ ఉంటే, దారిలో టీవీలు బాగుచేసే షాపులో ఒక టీవీని రోడ్డు వైపు తిప్పి ఉంచారు. ఆసమయంలో అందులో వార్తలు వస్తున్నాయి, నేను అటు దృష్టి పెట్టి వినేసరికి, అప్పుడు చదివిన వార్త విని దిగ్భ్రాంతి కి లోనయ్యాను. “నిన్న రాత్రి బెంగుళూరు నించి హైదరాబాద్ కి బయలుదేరిన జబ్బర్ ట్రావెల్స్ అనే ప్రైవేటు బస్సు అగ్ని ప్రమాదానికి గురై చాలామందికి తీవ్ర గాయాలు అయ్యాయి, పదిమంది వరకు చనిపోవడం జరిగింది” అని దాంట్లో వార్తలు చదువుతున్నారు. నేను వెంటనే రోడ్డు మీద కిందకి వంగి, పూజ్యశ్రీ అమ్మగారి పాదాలు అనుకుని ఆ మట్టిలో నమస్కారం చేసుకున్నాను. నిన్న నేను ఆ బస్సులో ప్రయాణం చేసి ఉంటే ఈపాటికి నా పరిస్థితి ఎలా ఉండేది? పూజ్యశ్రీ అమ్మగారు నన్ను ప్రయాణించకుండా చేయడం వల్ల, నా జీవితాన్ని కాపాడారు అని, ఒకటేసారి కృతజ్ఞత, ఆనందము, కొంచెం భయము ఇవన్నీ కలిగాయి.

## కరుణామయి అమ్మగారి సర్వజ్ఞత

ఒక వారం తర్వాత గుత్తి శ్రీనివాస్ గారు మా దగ్గరకు వచ్చి, శ్రీ సాయినాథ ప్రబోధామృతం గ్రంథం, కొన్ని పళ్ళు ఇవన్నీ ఒక పట్టువస్త్రంలో చుట్టి పట్టుకొచ్చి నాకు ఇస్తూ, ‘పూజ్యశ్రీ అమ్మగారు ఈ గ్రంథ ప్రతిని మీకు ఇమ్మన్నారు, ఈ పట్టు వస్త్రాన్ని మీరు ధ్యానం చేసుకున్నప్పుడు, గ్రంథాలు అనువాదం చేసినప్పుడు కప్పుకొమ్మన్నారు’, అని చెప్పగానే నాకు ఆనందబాష్పాలు పెల్లుబికాయి. నేను వారి చేతి నుంచి గ్రంథం మాత్రమే ఆశించాను. కానీ పూజ్యశ్రీ అమ్మగారు పట్టు వస్త్రాన్ని, గ్రంథాన్ని, ప్రసాదాన్ని, పంపించడమే కాదు, నా జీవితాన్ని కూడా నిలబెట్టారు, ఎంతటి కరుణామయులో కదా!!

## వివాహానికి మాతృమూర్తి ఆశీస్సులు

నా వివాహం కూడా అమ్మగారి ప్రమేయంతోనే జరిగింది. మా దూరపు బంధువుల అమ్మాయిని నేను వివాహం చేసుకున్నాను. అయితే అప్పట్లో, వారికి కానీ నాకు కానీ, ఈ అభిప్రాయం లేదు. ఒకరోజు నాకు కాబోయే మామగారికి ఒక స్వప్నం వచ్చింది. అందులో నాకు కాబోయే మామగారు, అత్తగారు, వారి అమ్మాయి, నేను, నలుగురం ఒక వీధిలో రాత్రి సమయంలో నడుస్తూ ఒకఇంటికి వెళ్ళామట. మేము ఆ ఇంటికి వెళ్లి తలుపు తట్టగానే పూజ్యశ్రీ అమ్మగారు తలుపులు తెరిచారట. పూజ్యశ్రీ అమ్మగారు తలుపు తీసి లోపలికి మమ్మల్ని ఆహ్వానించి, వారే స్వయంగా వంట చేసి మాకు భోజనం పెట్టారట. తర్వాత నలుగురిని విశ్రాంతి తీసుకోమన్నారట. కొంతసేపటికి మళ్ళీ తలుపు తట్టిన శబ్దం అయితే అమ్మగారు తిరిగి తలుపు తీశారట. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు లోపలికి వచ్చారట. వారిద్దరూ ఒక నులక మంచం మీద కూర్చుని ఉంటే నేను నా కాబోయే భార్య మాత్రమే వెళ్లి వారిద్దరికీ నమస్కారం చేసుకున్నామట. అంతటితో స్వప్నం ముగిసింది. తర్వాత ఆ అమ్మాయితోనే నాకు వివాహం జరిగింది. మా వివాహం కాకముందు మా మామగారికి పూజ్యశ్రీ మాస్టరుగారు, అమ్మగార్ల గురించి తెలియదు. మా వివాహం అయ్యాక ఈ స్వప్నం నాకు చెప్పారు. అంటే ఈ వివాహం పూర్తిగా అమ్మగారి అనుగ్రహంతో జరిగిందని అర్థమయ్యి చాలా సంతోషించాను.

*మిగతా 29వ పేజీలో*

(జనవరి సంచిక తరువాయి)

# శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

**శ్రీమతి శ్రీదేవి**

కాళీ మందిరానికి వెళ్ళే మార్గమంతా పర్వత ప్రాంతం. అద్భుతమైన ప్రకృతి సౌందర్యం నిండివున్న ఆ ప్రాంతంలో చుట్టూ పర్వతాల నడుమ కొండపై మెలికల దారిలో అమ్మతో ఆ ప్రయాణం భక్తులకు యెంతో అద్భుతమైన, ఆహ్లాదకరమైన అనుభూతిని కలిగించింది. కాళీ మందిర ప్రాంగణంలో సకల సదుపాయాలతో వున్న విశాలమైన గదులలో అమ్మ, బృందం విడిది చేశారు. సిమ్లాకు శ్రీ ఆనందమయి అమ్మ వచ్చారని తెలిసి ఆ ప్రాంతపు ప్రజలంతా వచ్చి అమ్మను దర్శించుకొన్నారు. అమ్మ సన్నిధిలో వారు అంతులేని ఆనందాన్ని పొందారు. రానురాను సిమ్లా ప్రజలకు అమ్మపై గల ఆ అవధులులేని ప్రేమ అమ్మతో వచ్చిన వారందరికీ యెంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. వారి మనసంతా యే పని చేస్తున్నా అమ్మను యెప్పుడు దర్శిద్దామా అన్న తపనతోనే నిండివుండేది. స్త్రీలంతా త్వరత్వరగా పనులు ముగించుకుని అమ్మ సన్నిధి చేరేవారు. పురుషులు సాయంత్రం ఆఫీసు పని ముగియటంతోటే యిళ్ళకు కూడా వెళ్ళకుండా నేరుగా అమ్మ సన్నిధి చేరేవారు. స్త్రీలు ఎండనక, వాననక కొండమెట్లు యెక్కి శ్రమను కూడ లెక్కచేయక పరుగుపరుగున వచ్చి అమ్మ సన్నిధిలో వాలిపోయేవారు. అమ్మ సన్నిధిని వీడి వెళ్ళలేక యెంత రాత్రి గడచినా అమ్మ దగ్గరే వుండిపోయేవారు.

వారి భక్తి ప్రేమలను చూసి కులదా దాదా ఒకరోజు అమ్మతో "అమ్మా! ఆనాడు శ్రీకృష్ణుని యెప్పుడెప్పుడు చూద్దామా అని ఆతృతతో యేవిధంగా గోపికలు పరుగు పరుగున శ్రీకృష్ణుని వద్దకు వచ్చేవారో, అదే విధంగా వున్నది వీరి పరిస్థితి. మీ దర్శనం కోసం స్త్రీలు సహితం త్వరత్వరగా యింటి పనులన్నీ ముగించుకొని యిళ్ళూ వాకిళ్ళూ వదిలేసి యింత తపనతో మీకోసం వస్తున్నారంటే మీరు శ్రీ కృష్ణునిలాగా, వీరంతా గోపికలలాగా నాకు అనిపిస్తున్నది" అన్నాడు. అలాగే ఆఫీసులకు వెళ్ళే వుద్యోగస్థులంతా కనీసం బట్టలు మార్చుకొనటానికైనా, టీ తాగటానికైనా యింటికి వెళ్ళకుండా నేరుగా ఆఫీసుల నుండి అమ్మ వద్దకే రావడం మొదలుపెట్టారు. వారి పరిస్థితి చూసి అమ్మ వాళ్ళు రాగానే వాళ్ళకు టీ, ఫలహారాలు సమకూర్చే యేర్పాట్లు గావించారు.

అమ్మ నవ్వుతూ వాళ్ళతో "ఏమిటి, మీరంతా యిలా చేస్తున్నారు? మీరందరూ పిచ్చివాళ్ళయిపోయారా యేమిటి? ఆఫీస్ నుండి రాగానే టిఫిన్ చేయటం, టీ త్రాగటం, షికారు తిరిగేందుకు యింటి నుండీ బయటకు వెళ్ళటం – యివన్నీ యెక్కడకు పోయాయి? చూస్తుంటే అవన్నీ మీరు మరచిపోయినట్లున్నారు. నేను మీవలె రక్తమాంసాల దేహం వున్న మనిషినే కదా? ఇక్కడ యేమున్నదని వస్తున్నారు?" అన్నారు. అందుకు సమాధానంగా వారు "అమ్మా! మీరు మావంటి మామూలు



మనిషి కారు, దైవస్వరూపులు. మీలోని విశ్వమానవ ప్రేమయే మమ్మల్ని మీవద్దకు లాక్కొస్తున్నది?" అన్నారు

పర్వత ప్రాంతం. నలుదిక్కుల ఆవరించి వున్న పర్వత శ్రేణులు. మనోహర ప్రకృతి దృశ్యాలతో నిండి వున్న ఆ ప్రాంతంలో అమ్మ పగలు, సాయంత్రం వేళలలో కొంతసేపు వ్యాహ్యాళికి వెళ్ళేవారు. ఆ సమయంలో అనేకమంది భక్తులు అమ్మతో కలసి నడుస్తూ అమ్మతో సంభాషించేవారు. అమ్మ దివ్యోపదేశాలను విని ఆనందించేవారు. ఒకనాటి మధ్యాహ్నం కొందరు పంజాబీ స్త్రీలు అమ్మ దర్శనార్థం వచ్చారు. వారు శ్రీ ఆనందమయి అమ్మను "గృహస్థులు యెటువంటి సాధన చేయాలి?" అని అడిగారు. "సేవ, మంత్రజపము అనేవి గృహస్థులు తరించడానికి వుపయోగపడే సాధనోపాయాలు" అన్నారు అమ్మ. మరల ఆ స్త్రీలు "అమ్మా! జపము రోజుకు ఒక్కసారే చేయాలా లేక రెండు మూడు సార్లు చేయవలసి వుంటుందా?" అని అడిగారు. అందుకు అమ్మ "ప్రతిరోజూ యేవిధంగానైతే శరీరానికి కావలసిన ఆహారాన్ని రెండు పూటలా తీసుకుంటామో అదే విధంగా ప్రతిరోజు వుదయము, సాయంత్రము జపము, సంకీర్తన, పూజ నియమంగా తప్పనిసరిగా చేయాలి. మధ్యమధ్యలో చిరుతిండ్లు, పండ్లు తింటూ వుంటాము, పాన్ వేసుకుంటాం. అలాగే శక్తి మేరకు రోజులో యెక్కువసార్లు పూజ, చింతన, స్మరణ శక్తి మేరకు చేస్తుండాలి" అన్నారు అమ్మ.

ఒక రోజు సాయంత్రం అమ్మ గదిలో తన మంచంపై కూర్చుని వున్నారు. గది తలుపులన్నీ తెరచి వున్నాయి. దూరంగా పర్వత సముదాయం, కొండలపై యిళ్ళు, పొలాలు కనిపిస్తున్నాయి. ఆ మనోహర ప్రకృతి నడుమ ఆ ప్రశాంత వాతావరణంలో అమ్మ సన్నిధిలో భక్తులు యెంతో సంతోషంగా అమ్మతో సంభాషిస్తున్నారు. కొందరు ఆధ్యాత్మిక సందేహాలు వ్యక్తపరుస్తుంటే అమ్మ సులభమైన రీతిలో వారికి సమాధానాలు చెపుతూ వారి సందేహాలు తీరుస్తున్నారు. ఒక భక్తుడు "అమ్మా సమాధి అంటే యేమిటి?" అని అడిగాడు. అమ్మ అతనితో "భావము, కర్మలు అన్నీ సమాధానపడిన స్థితి. అంటే సమాప్తి చెందిన స్థితి, దాని పేరే సమాధి" అని చెప్పి మరల అమ్మ "అంటే మీ సాంసారిక దృష్టికోణంలో చెప్పాలంటే మీరు రోజంతా పనులు చేసుకుంటూ, తింటూ, త్రాగుతూ, తిరుగుతూ, మాట్లాడుకుంటూ గడిపి, ఆ తర్వాత రాత్రి, గాఢనిద్రలోకి వెళ్ళిపోయినట్లు అన్న మాట " అన్నారు.

**- సశేషం**

(గత సంచిక తరువాయి)

# శ్రీ గురుచరిత్ర సప్తాహ సత్సంగ ప్రవచన యాత్ర (శ్రీ క్షేత గాణ్గాపురం)

*శ్రీమతి టి. పద్మావతి*

**(ఆధ్యాత్మిక వైభవానికి నిలయమైన పవిత్రమైన భీమ-అమరజా నదుల సంగమతీరంలో సాక్షాత్తు దత్తావతారమైన శ్రీ నృసింహ సరస్వతిస్వామివారు సుదీర్ఘకాలం నివసించి నేటికీ నిర్గుణ పాదుకల రూపంలో విరాజమానులైవున్న శ్రీ క్షేత్ర గాణ్గాపుర యాత్రలో గురుపుత్రిక శ్రీమతి వేదమ్మగారు, శ్రీశ్రీకాంత్‌గార్లు వారి కుమారులు చిరంజీవి తీర్థ చరణ్ మరియు కుమార్తె చిరంజీవి కైవల్య లతో సకుటుంబంగా పాల్గొని గత సంవత్సరం నవంబరు 26వ తేదీ నుండి డిసెంబరు 2వ తేదీ వరకు శ్రీ గురుచరిత్ర సప్తాహ ప్రవచనం చేశారు. మన సాయిబాబా పత్రిక పాఠకుల కోసం హృద్యంగా అందించబడిన యీ అద్భుతమైన యాత్రా విశేషాలను ఫిబ్రవరి సంచిక నుండి మీ ముందుంచుతున్నాం! - ఎడిటర్.)**

## ముగింపు

డిసెంబరు 2వ తేదీ, కార్యక్రమం చివరి రోజున శ్రీ శ్రీకాంత్‌గారి కుటుంబ సభ్యులు శ్రీగురునికి విశిష్టమైన 'భిక్ష' సమర్పించుకున్నారు. ఆ పవిత్రదినాన అరుణోదయ వేళనే, శ్రీమతి వేదమ్మగారు శ్రీగురుని దివ్య మంగళ స్వరూపానికి పట్టు వస్త్రాలను సమర్పించగా, ఆలయ పూజారులు వాటిని స్వామివారికి అత్యంత భక్తిశ్రద్ధలతో ధరింపజేశారు.

అనంతరం శ్రీ శ్రీకాంత్‌గారి ఆధ్వర్యంలో, చిరంజీవులు తీర్థ చరణ్ మరియు కైవల్య సత్సంగ సభ్యులందరి సమక్షంలో అత్యంత నిష్ఠతో రుద్రాభిషేకం గావించారు. తరువాత పరమ పవిత్రమైన శ్రీగురు పాదుకా పూజను భక్తి శ్రద్ధలతో పూర్తి చేసుకున్నారు. సాక్షాత్తు దత్తప్రభువు చరణ కమలాల చెంత ఆ చిన్నారి భక్తులు పూజ చేస్తున్న దృశ్యం చూసేవారికి కనువిందు కలిగించింది.

ఆపై యాత్రలోనే అత్యంత కీలకమైన భిక్షా కార్యక్రమం మొదలైంది. ప్రసన్న పూజారిగారి నివాసం నుండి భిక్షను స్వీకరించడానికి శ్రీకాంత్‌గారు, తీర్థచరణ్ బయలుదేరగా, పవిత్రమైన దండం ధరించి కైవల్య వారిని అనుసరించింది. బాజాభజంత్రీల మంగళ ధ్వనుల మధ్య, భక్తులందరూ భజన చేస్తుండగా భక్తి పారవశ్యంతో భిక్షను స్వామివారికి నివేదించారు. ఆ భిక్షా యాత్ర సాగే మార్గమంతా సత్సంగ సభ్యులు రంగురంగుల రంగవల్లులతో అత్యంత సుందరంగా అలంకరించారు. అనంతరం ఆ పవిత్ర ప్రసాదాన్ని భక్తులందరికీ వితరణ చేశారు. శ్రీకాంత్‌గారి కుటుంబం ద్వారా లభించిన ఆ ప్రసాదాన్ని స్వీకరించి, గురుకుటుంబ సభ్యులందరూ ధన్యులయ్యారు.

శ్రీగురుచరిత్ర సప్తాహ పారాయణలో చివరి రోజు సాయంత్రం, శ్రీ శ్రీకాంత్‌గారు సత్సంగ సభ్యులను ఉద్దేశించి చేసిన ప్రవచనం ఎంతో హృద్యంగా సాగింది.

ఆయన వాగ్ధాటిలో గురుతత్త్వం జాలువారుతుండగా, వేదికను అలంకరించిన శ్రీ దత్తాత్రేయ స్వామికి, సమర్థ సద్గురు సాయినాథులకు, పూజ్యశ్రీ అలివేలుమంగా సమేత భరద్వాజ గురుదేవులకు, శ్రీ నృసింహ సరస్వతి స్వాముల వారికి అత్యంత భక్తితో నైవేద్యాన్ని సమర్పించి, మంగళ హారతులతో పారాయణకు స్వస్తి పలికారు.

శ్రీ గురు చరణ సన్నిధిలో సాగిన సప్తాహ పారాయణ మహోత్సవం అత్యంత మంగళప్రదంగా పూర్తయిన పిదప, భక్తజన హృదయాల నుండి ఉప్పొంగిన జయజయధ్వానాల మధ్య పల్లకి ఉత్సవం అంబరాన్నంటిన వైభవంతో మొదలైంది. ఆ పవిత్ర సమయంలో, శ్రీకాంత్‌గారి కుటుంబ సభ్యులు భక్తిప్రపత్తులతో స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించుకుని తమ కృతజ్ఞతను చాటుకున్నారు. అనంతరం, ఆ దత్తప్రభువు కొలువై ఉన్న దివ్య పల్లకీని అనుసరిస్తూ, ఆలయ ప్రాంగణంలో సాగిన పరిక్రమణ (ప్రదక్షిణ) ఘట్టం ఆ కుటుంబానికి ఒక అపురూప వరంగా నిలిచింది. పల్లకి వెంట సాగుతున్న ప్రతి అడుగులోనూ, తాము సాక్షాత్తు ఆ పరమ గురువు వెంటే నడుస్తున్నామన్న అలౌకిక భావన వారిని పులకింపజేసింది. భక్తుల కోలాహలం, మంగళ వాయిద్యాల హోరు మధ్య సాగిన ఆ ప్రదక్షిణ, భక్తులందరికీ వర్ణనాతీతమైన, అనిర్వచనీయమైన ఆధ్యాత్మిక అనుభూతిని ప్రసాదించింది.

సప్తాహ ప్రవచనాలు ముగిసి, యాత్ర ముగించుకుని తిరిగి ప్రయాణమవ్వాల్సిన సమయం రానే వచ్చింది. ఆ ఏడు రోజులు శ్రీగురుని కరుణా నిలయంలో, వేదమ్మగారు, శ్రీకాంత్‌గార్ల అమృతవాణిలో తడిసి ముద్దయిన భక్తుల హృదయాలు భారమయ్యాయి. క్షేత్రం నుండి వెళ్తున్నా, మనసంతా ఆ నిర్గుణ పాదుకల వద్దే వుండిపోయింది. సంగమ తీరంలోని ఆ ప్రశాంతత, మధుకరి లీలలు, పల్లకి సేవలోని ఆ దివ్యత్వం ప్రతి ఒక్కరి కళ్లముందు కదలాడాయి.

“స్వామీ! మా అజ్ఞానాన్ని మన్నించి, నీ పాదాల చెంతకు మమ్మల్ని చేర్చుకున్నందుకు ధన్యవాదాలు” అని భక్తులు ఆర్తితో ప్రార్థించారు. కేవలం ఒక యాత్రలా కాకుండా, ప్రతి భక్తుడిలో ఒక అంతర్మథనాన్ని, సరికొత్త ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపిన ఈ యాత్ర శ్రీగురుని అనుగ్రహం లేనిదే సాధ్యం కాదని అందరూ విశ్వసించారు. యాత్రను ఇంత నిర్విఘ్నంగా, అద్భుతంగా నడిపించిన ఆ దత్తప్రభువుకు, మార్గదర్శనం చేసిన వేదమ్మగారికి, సేవలందించిన కమిటీ సభ్యులకు ప్రతి ఒక్కరూ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

కళ్లల్లో ఆనంద బాష్పాలు, పెదవులపై ‘దిగంబరా దిగంబరా శ్రీపాద వల్లభ దిగంబరా’ అన్న నామస్మరణతో భక్తులు గాణ్గాపుర గడ్డకు ప్రణమిల్లారు. శ్రీగురుడు తమ వెంటే వున్నాడన్న అచంచలమైన విశ్వాసంతో, నిండు మనసుతో తమ ఇళ్లకు ప్రయాణమయ్యారు. ఈ గాణ్గాపుర యాత్ర ప్రతి భక్తుడి హృదయంలో ఒక దివ్య స్మృతిగా, నిరంతరం వెలిగే ఆధ్యాత్మిక దీపమై నిలిచిపోతుంది.

యాత్రలో మరొక విశేషము ఏమిటంటే 2వ తేదీ ప్రవచనం పూర్తయిన తర్వాత కూడా కొంతమంది సత్సంగసభ్యులు దత్త జయంతి వరకు గాణ్గాపూర్ లోనే వుండిపోయి ఆ మరుసటి దినం బయలుదేరి వచ్చారు. దత్తజయంతి రోజున వీరందరూ ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8గంటలవరకు శ్రీగురుని దర్శనానికి వచ్చిన భక్తులందరికీ ప్రసాద వితరణ చేశారు. అందులో పాల్గొని సేవ చేసుకున్న మన వాళ్ళందరూ చాలా ఆనందాన్ని పొందారు, అటువంటి క్షేత్రం లో అంతటి సేవ చేసుకోవడం అదృష్టంగా భావించారు.

## వైకుంఠ సమారాధన

పుణ్యక్షేత్ర దర్శనానంతరం వైకుంఠ సమారాధన నిర్వహించడం ఒక పరమ పవిత్రమైన ఆచారం. ఈ సాంప్రదాయాన్ని పునరుద్ధరిస్తూ పూజ్యశ్రీ అమ్మగారు క్షేత్ర దర్శనం ముగించుకున్న భక్తులందరితో ఈ మహోత్సవాన్ని అత్యంత నిష్ఠతో నిర్వహింప చేసేవారు. యాత్ర ముగించినప్పటి నుండి సమారాధన జరిగే

వరకు గల సమయమంతా ఆ యాత్ర ప్రభావాన్ని తమ హృదయాలలో మరింత బలపరచుకోవాలి. సద్గురు కృపకు కృతజ్ఞతగా సాగే ఈ క్రతువులో పూజ, సత్సంగము నిర్వహించి, యాత్ర విశేషాలను సాటి భక్తులతో చర్చించి, స్వామికి నివేదించిన నైవేద్యంతో పాటు క్షేత్రం నుండి తెచ్చిన పవిత్ర ప్రసాదాన్ని భక్తజనులందరితో పంచుకోవడమే ఈ సమారాధన విధానం.

ఈ దివ్య సంప్రదాయాన్ని అనుసరిస్తూ, గాణగాపూర్ యాత్ర ముగించుకున్న భక్తులందరూ జనవరి రెండవ తేదీన పూజ్యశ్రీ అమ్మవారి దివ్య సన్నిధానంలోనూ, మూడవ తేదీన గురుదంపతుల నిలయంలోనూ మరియు నాలుగవ తారీఖున పూజ్యశ్రీ మాస్టరుగారి బృందావనంలోనూ సమారాధన జరుపుకోవాలని భక్తితో నిర్ణయించుకున్నారు. ఈ నిర్ణయం మేరకు, ఒంగోలు క్షేత్రంలో జనవరి 2, 3, 4 తేదీలలో సమారాధన మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.

జనవరి 2వ తేదీన భక్తులందరూ పూజ్యశ్రీ అమ్మవారి దివ్య సన్నిధానంలో సమావేశమై సమారాధన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా పూజ్యశ్రీ వేదమ్మగారు, సద్గురుదేవులు పూజ్యశ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారు రచించిన “షిరిడీ క్షేత్ర సందర్శనము” మరియు “దత్తావతార మహత్యం” గ్రంథాలలోని విశేషాలను ప్రవచించారు. ఒక పుణ్యక్షేత్రానికి వెళ్ళినప్పుడు యాత్రను ఏ విధంగా సాగించాలి, ఏ ఆధ్యాత్మిక భావంతో దైవాన్ని దర్శించుకోవాలి మరియు దత్త క్షేత్రాల ప్రాశస్త్యం ఏమిటో భక్తులకు వివరించారు. ముఖ్యంగా దత్తావతార మహత్యం చదివే సమయంలో, ఆయా దత్త క్షేత్రాల మహిమలతో పాటు అక్కడ నివసించిన ఎంతోమంది ఉద్ధండులైన మహాత్ముల చరిత్రలను, వారు చూపిన ధర్మ మార్గాన్ని భక్తులు లోతుగా చర్చించుకున్నారు. ఆ మహనీయుల జీవిత విశేషాలు భక్తులలో సరికొత్త ఆధ్యాత్మిక ఉత్తేజాన్ని నింపాయి.

జనవరి 3వ తేదీన గురుదంపతుల నిలయంలో సమారాధన కార్యక్రమాలు కొనసాగాయి. సాయంత్రం వేళ పూజ్యశ్రీ వేదమ్మగారు గాణగాపూర్ యాత్రలోని సంఘటనలను, క్షేత్ర విశేషాలను భక్తులకు వివరిస్తూ ప్రవచించారు. ఈ సత్సంగములో యాత్రకు సంబంధించిన ప్రతి ఘట్టాన్ని, ఆధ్యాత్మిక విశేషాలను చర్చిస్తూ, ఆ అనుభూతులను అందరితో పంచుకుంటూ ఆ సత్సంగం జరిగింది.. తమ హృదయాల్లో ముద్రించుకున్న ఆ దివ్య జ్ఞాపకాలను పంచుకోవడం వల్ల ఆధ్యాత్మిక శక్తి అందరిలోనూ ప్రవహించింది. అనంతరం గురుదంపతుల నిలయంలో భక్తులు కృతజ్ఞతతో సమారాధన జరుపుకున్నారు.

యాత్రకు మంగళప్రదమైన ముగింపునిస్తూ, జనవరి 4వ తేదీన పూజ్యశ్రీ మాస్టరుగారి బృందావనంలోనే సమారాధన చేయాలని భక్తులందరూ భక్తితో నిర్ణయించుకున్నారు. ఈ నిర్ణయం ప్రకారం, ఉదయాన్నే గురుదంపతుల నిలయంలో భజన నిర్వహించి, పూజ్యశ్రీ మాస్టరుగారికి, సమర్థ సద్గురు అయిన సాయినాథునికి నైవేద్యం సమర్పించడం కోసం నిష్ఠతో తయారుచేసిన నైవేద్యాన్ని భక్తిశ్రద్ధలతో వెంట తీసుకున్నారు. దత్తాత్రేయుల, సాయినాథుల, గురుదంపతుల చిత్రపటాలను చేతబూని, జయజయధ్వానాల మధ్య ఊరేగింపుగా పూజ్యశ్రీ మాస్టరుగారి బృందావనం చేరుకున్నారు. ఆ దివ్య సన్నిధిలో కొంతసేపు హృదయపూర్వకమైన నామస్మరణ, భజనలు నిర్వహించి, సద్గురు మూర్తులకు నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తిపారవశ్యంతో మధ్యాహ్న హారతి పాడుకుని, మందిర ప్రాంగణంలోనే సామూహికంగా సమారాధన ప్రసాదాన్ని స్వీకరించారు. దీనితో గాణగాపూర్ యాత్ర సమారాధనతో సంపూర్ణమై మంగళప్రదంగా ముగిసింది. భక్తులు ఇనుమడించిన భక్తి భావంతో కృతజ్ఞతతో తృప్తిగా తమ తమ స్వస్థానాలకు చేరుకున్నారు.●

# ముక్తి సాధనకు ముఖ్య సోపానాలు - నిష్ఠ, సబూరి!

# -మాతృశ్రీ మాటలలో-

శ్రీమతి శ్రీదేవి

మాతృశ్రీ అలివేలు మంగమ్మగారు ఒకసారి సత్సంగం జరుపుతున్న సందర్భంలో నిష్ఠ, సబూరీల గురించి యిలా వివరించారు.

"నిష్ఠ అంటే నియమము అని అర్థము. ఏదైనా ఒక పని చేయ సంకల్పించినప్పుడు దానిని సక్రమంగా పూర్తి చేయటానికి యెంతో శ్రద్ధతో కృషి చేయవలసి వుంటుంది. ఆ పని పూర్తి అయ్యేంతవరకు యెంత యెక్కువగా ఆ పనిపై దృష్టిని కేంద్రీకరిస్తే అంత చక్కగా ఆ కార్యం నెరవేరుతుంది. ఈ నియమనిష్ఠలు అనేవి ముక్తిసాధనలో ప్రథమ స్థానం వహిస్తాయి. మోక్ష సాధనామార్గంలో నడిచేటప్పుడు జీవితంలోని ప్రతిరోజు, ప్రతి నిమిషం, ప్రతిక్షణం కూడా విలువైనవే. సమయాన్ని యెలా వినియోగించుకోవాలో సూచించే ఒక ప్రణాళికను తయారు చేసుకొని ఆ ప్రణాళిక ప్రకారం రోజులో అధిక భాగం, యింకా చెప్పాలంటే రోజు మొత్తం సాధన నిరాటంకంగా జరిగే విధంగా చూచుకొనడం అవసరం. ప్రాపంచిక వ్యవహారాలకు యెక్కువ ప్రాధాన్యతనిస్తే సాధన అనేది శ్రద్ధగా ముందుకు సాగటం అసంభవం. అందువలన ముక్తి సాధించాలని కోరుకున్నవాడు లౌకిక జీవితానికి, ప్రాపంచిక వ్యవహారాలకు సాధ్యమైనంత తక్కువ సమయం కేటాయించుకొనక తప్పదు. అలాకాకుంటే యిది చిల్లుల గంపను నీటితో నింపాలనుకోవటం వలె వుంటుంది. కొంతసేపు మాత్రమే జపధ్యానాదులు చేసి మిగిలిన సమయం అంతా ప్రాపంచిక వ్యవహారాలలో మునిగితేలితే సాధన ఒక్క అడుగు కూడా ముందుకు సాగదు. ఇక లక్ష్యసాధన అందని ద్రాక్ష పండే అవుతుంది. కళ్ళు మూసుకుని ఒక్క పావు గంటసేపు లేదా ఒక్క ఐదు నిమిషములు అయినా కూర్చుని మనసును గమనిస్తే చాలు - మనసు యెన్ని వైపులకు, యెన్ని విషయాలపై, యెంతగా పరుగులు పెడుతూ వుంటుందో మనకే అర్థం అవుతుంది. ఇటువంటి చంచలమైన మనస్సుని భగవంతునిపై నిలపాలంటే ప్రాపంచిక విషయాలపై యెంతగా మన మనసును నియంత్రించుకుంటే అంత మంచిది. ప్రాపంచిక విషయాలు మనసును బహిర్ముఖం చేసి, యేకాగ్రతను విచ్ఛిన్నం చేస్తాయి. కనుక **'లోకదృష్టి విడచి లోచూపు చూడుమా'** అని వేమన చెప్పినట్లు లౌకిక వ్యవహారాలపై నియంత్రణ అనేది సాధనలో అనివార్యం. ఈ నియంత్రణ కూడా నిష్ఠలో ఒక భాగమే. కనుక జీవితమంతటిని ఒక దీక్ష చేబూనినట్లుగా, ఒక వ్రతాన్ని ప్రారంభించినట్లుగా భక్తిశ్రద్ధలతో తనువును, మనస్సును సద్గురువుకు అర్పణ చేసినప్పుడే గమ్యం చేరగలము. ఈ విధమైన సంకల్పమే నిష్ఠ. ఇందుకై చేసే కృషికి కావలసినవి నియమ నిష్ఠలు."

"ఇక సబూరీ గురించి చెప్పాలంటే - సబూరీ అంటే విశ్వాసముతో కూడిన ఓరిమి అని అర్థము. శ్రీ సాయినాథుడు సాధనలో నిష్ఠకు వలెనే సబూరీకి కూడా అత్యధిక ప్రాధాన్యత నిచ్చారు. నిష్ఠా సబూరీలలో మొదటి స్థానం సబూరీ అనేదానికే యివ్వవలసి వుంటుంది. ఎలాగంటే ఒక భవనం నిర్మించాలంటే

ముందుగా నిర్మించేది పునాది. ఈ పునాదిపైనే అనేక అంతస్తుల నిర్మాణం జరుగుతుంది. అంత పెద్ద భవనాన్ని మోసేది ఆ పునాదిరాళ్ళే! ఆ పునాదిరాళ్ళే లేకుండా భవనాన్ని నిర్మిస్తే ఆ భవనం నిలబడదు. కనుక సాధనలో విశ్వాసం, ఓర్పు అనేవి పునాదిరాళ్ల వంటివి. ఇంకా చెప్పాలంటే ఒక కట్టడం యొక్క నిర్మాణం మొదటగా పునాది నిర్మాణంతోనే ఆరంభం అయినట్లే, సాధన అనేది విశ్వాసంతోనే మొదలవుతుంది. విశ్వాసంతోనే ముందుకు సాగుతుంది. ముముక్షువుల ఆధ్యాత్మిక ప్రయాణంలో మొదటి అడుగు భగవంతునిపై విశ్వాసంతోనే ప్రారంభం అవుతుంది. నాస్తికుల వంటివారు కూడా ఈ సకల సృష్టిని నడిపించే యేదో ఒక శక్తి వున్నదని నమ్ముతారు. సత్యాన్వేషకులుగా పిలవబడేవారు ఆ విశ్వాసంతోనే అటువంటి శక్తి యొక్క మూలాన్ని అంటే సృష్టి తత్వాన్ని తెలుసుకొన ప్రయత్నిస్తారు. కనుక సాధనలో యే మార్గాన్ని అనుసరించినప్పటికీ ఆ మార్గానికి దేముడు, గురువు, శక్తి – యిలా యే పేరు పెట్టుకున్నప్పటికీ, ఆ అన్వేషణ విశ్వాసంపైనే ఆధారపడివున్నది. సాధన ఫలించే వరకూ చేసే కృషి ఆ విశ్వాసాన్ని ఓర్పుతో నిలబెట్టుకొనడం పైనే ఆధారపడి ముందుకు సాగుతుంది. అదే సబూరీ అంటే!"

"శ్రీ సాయినాథుడు సబూరీ గురించి చెప్పడంలో ఒక గొప్ప సాధనా రహస్యం యిమిడి వున్నది. ఈ రహస్యాన్ని గురించి శోధించినప్పుడు కొన్ని విషయాలు ఆశ్చర్యకరంగా అనిపిస్తాయి. అసలు సబూరీ అనేది సాధనలో యెందుకు, యెలా అవసరం అవుతుందంటే – మొదటగా సాధనను అంతర్మథనం అని చెప్పుకోవలసి వుంటుంది. ఇదంతా బహిర్ముఖమయిన మనసు అంతర్ముఖమై హృదయపు లోతుల్లోకి ప్రయాణించుటకు సాధనలో జరిగే ప్రక్రియ. బాహ్య ప్రపంచానికి, విషయాలకు అలవాటయిన యింద్రియ కార్యకలాపాలను నియంత్రించి మనసును ఒకే విషయంపై (భగవంతుడు లేక గురువు లేక శక్తి, అది సాకారమైనా లేక నిరాకారమైనా) కేంద్రీకృతం చేయటం చాలా కష్టమైన పని. నిరంతరం చలించే మనసును యేకాగ్రం చేయటానికి యెంత కాలం పడుతుందో, యింకా చెప్పాలంటే యెన్ని జన్మలు పడుతుందో కూడా చెప్పలేము. అందువలన అంతకాలమూ, ఫలితం లభించేవరకు సాధన చేయాలంటే అత్యంత ఆవశ్యకమైన విషయమే ఓర్పు. ఈ ఓర్పు లేనప్పుడు సాధనను మధ్యలోనే వదిలి వేసే ప్రమాదం వుంది. అటువంటి వారి గురించి శ్రీ సాయి 'పండుగా మారకముందే రాలిపోయే మామిడి పూతతోను, పక్షుల బారిన పడి పెనుగాలి తాకిడికి ఫలించక ముందే రాలిపోయే పిందెలతోనూ' పోల్చడం జరిగింది. ఆధ్యాత్మిక సాధన నాన్ఘాట్ దున్నపోతుపై దాటడం వంటిది అనీ, శక్తిని అంతా కూడగట్టి కృషి చేయవలసి వుంటుందనీ సాయినాథుడు చెప్పారు. కనుక సాధకుడు సాధనలో యెదురయ్యే ఆటంకాలు, అవరోధాలకు వెరవకుండా ముందుకు సాగాలంటే అవసరమైనదే ఓర్పు. ఈ ప్రయాణంలో సాధకునికి భగవంతుడు యెన్నెన్నో సమస్యల రూపంలోనూ, కష్టాలు రూపంలోనూ పరీక్షలు పెడుతుంటాడో మనం యెందరో భక్తుల, సాధకుల జీవిత చరిత్రల ద్వారా తెలుసుకుంటూ వుంటాము."

ఇందుకు కొందరు భక్తుల అనుభవాలను తెలియజేస్తూ శ్రీ అమ్మగారు తమ ప్రసంగం యింకా యిలా కొనసాగించారు: "అల్లా మిళనారా సప్త సముద్ర నిషూల్ కారణ్" (భగవంతుని చేరటానికి సప్త సముద్రాలు మరియు లోకాలు దాటిపోవాలి)అనీ, "వేదాపార్ కర్నా" (బంధాలను దాటి పోవాలి) అనీ శ్రీ సాయి చెప్పారు. శ్రీ సాయి తత్వాన్ని గురించీ, సాధనలో నిష్ఠా సబూరీల ప్రాధాన్యత గురించీ శ్రీ భరద్వాజ గురుదేవులు అనేక సందర్భాలలో వివరించటం జరిగింది."

"శివ భక్తుడైన ఒక సాధకుడు శివుని సాక్షాత్కారం కోరి జీవితమంతా శివస్మరణ చేశాడు. ఎంత కాలానికీ అతనికి శివుడు సాక్షాత్కరించలేదు. విసిగి వేసారిన ఆ భక్తుడు ఒకరోజు ఒక తీవ్రమైన నిర్ణయం తీసుకున్నాడు. 'వేయి బిందెల గంగాజలంతో శివునికి అభిషేకం చేస్తాను.

వేయి బిందెలు పూర్తి అయ్యే లోపల శివుడు నాకు దర్శనం యివ్వాలి' అని సంకల్పించి అభిషేకం ప్రారంభించాడు. ఎంతో ఓర్పుతో తొమ్మిది వందల తొంబై తొమ్మిది బిందెల గంగాజల అభిషేకం పూర్తి అయింది. కానీ శివదర్శనం కాలేదు. ఇక అతడు సహనం కోల్పోయాడు. 'శివుని ఆరాధించటం వ్యర్థం. 999 బిందెలు పూర్తి అయినా దర్శనమీయని వాడు – వెయ్యి కాదు, లక్ష బిందెలతో అభిషేకిస్తే మాత్రం – దర్శనమిస్తాడా? ఇవ్వనే యివ్వడు అని అర్థమైంది. ఎందుకంటే అతడు దయామయుడు కాదు. అత్యంత కఠినాత్ముడు' అనుకుంటూ శివుని తిట్టుకుంటూ ఆ చివరి నీళ్ల బిందెను శివలింగంపై విసిరి కొట్టాడు. ఆశ్చర్యమేమంటే వెంటనే అతనికి "నేను వెయ్యి బిందెలు పూర్తయిన వెంటనే నీకు దర్శనమీయదలచాను. కానీ నీవు చివరి నిమిషములో సహనం కోల్పోయావు. నాపై ఆగ్రహించావు. సహనం లేని నీవు నా దర్శనం పొందే అర్హతను కోల్పోయావు. నీకు మరుజన్మలో నా సాక్షాత్కారం తప్పక లభిస్తుంది" అనే శివుని అశరీరవాణి వినిపిస్తుంది. కనుక సాధన ఫలించే వరకు ఓర్పుతో వేచి వుండాలి. ఎందరెందరో మహనీయులు వారి జీవితాలలో యెన్నో విధాలైన పరీక్షల నెదుర్కొని ఓర్పు విశ్వాసాలతో చివరివరకు సాధన కొనసాగించి సఫలీకృతులైన ఉదంతాలు వింటుంటాం."

"కనుక విశ్వాసంతో కూడిన ఓరిమి, నిష్ఠలు ముక్తిసాధనకు ఆవశ్యకమైనవిగా చెప్పబడ్డాయి. అందువలన శ్రీ సాయినాథుడు ముక్తిసాధనకు ముఖ్య సోపానాలుగా నిష్ఠా సబూరీలను ప్రతిపాదించారు."

ఇలా మాతృశ్రీ అలివేలుమంగామాత సాధనా రహస్యాలను భక్తులకు చక్కని వివరణలతో బోధించారు. నిరంతరం తన బోధలతో భక్తులలో ఆధ్యాత్మిక జాగృతిని కలిగించిన మన మాతృదేవి దివ్య పాదారవిందములకు భక్తితో ప్రణామాలర్పిద్దాము!

జై సాయి మాస్టర్!

# వార్తాలాపము

12వ పేజీ తరువాయి

(ఐదు అగ్నులు వెలిగించి) వేడిని కూడా భరిస్తారు. ఇవన్నీ పేరుప్రతిష్టలకు మాత్రమే!!

ఈ భస్మము మొ॥వి ధరించడం వల్ల వారు ఎటువంటి ఆధ్యాత్మిక ఫలితాన్ని కోరుకోరు. ఇవి అన్నీ లౌకిక జీవితం గడుపుకోవడానికి మాత్రమే. ఎందుకంటే వేదాలను ఎటువంటి తెలివీ లేని వాళ్ళే నమ్ముతారని నాస్తికుల అభిప్రాయము.

ఈ సిద్ధాంతాన్ని అంగీకరించే నాస్తికులు ఈ మాటలను అక్షేపించడానికే చెప్పారు. కానీ ఇవన్నీ ఇప్పుడు నిజంగానే జరుగుతున్నాయి. ఈనాటి ఆస్తికుల మాటలు, వేషాలు పరమ లౌకికత్వాన్నే సూచిస్తున్నాయి. కానీ ఆంతర్యంలోని నమ్మకంలోను, చేసే ప్రవర్తనలోను చార్వాకులైన నాస్తికుల సిద్ధాంతాలను కూడా ఉల్లంఘిస్తారు. ఈ రోజులలో పుణ్యక్షేత్రాలలోను, మందిరాలలోను, ఆశ్రమాలలోను ఎన్నో పనులు చేస్తూ అన్ని చోట్లా కనిపిస్తూనే వుంటారు. ప్రతిచోట గురువులు, ఆచార్యులు అని పిలువబడుతూ ప్రజలకు భగవంతుడు మాత్రమే సత్యమని, మిగిలినదంతా అసత్యమని, ప్రపంచంలోని పదార్థాలన్నీ మాయ అనీ – ఇలాంటి వైరాగ్యపు బోధలెన్నో చేస్తారు. కానీ వారి ఆచరణలో ఆ వైరాగ్యము కొంచెం కూడా కనిపించదు. వారికి మంచి మంచి భవనాలు కావాలి. రుచికరమైన ఆహారమూ కావాలి. అందమైన బట్టలు వారికి కావాలనిపిస్తుంది. చాలా ధనం సంపాదించాలనుకుంటారు. ఇలా అతి ప్రవృత్తి (మితిమీరిన ప్రవర్తన, కోరికలు) కలిగి వుంటారు. నిజానికి వీరందరూ నాస్తికులే!

ఈ విషయంలో ఒక ముస్లిం మహాత్ముడు ఇలా చెప్పాడు – "వైరాగ్యాన్ని పొందకుండానే జ్ఞానానికి సంబంధించిన విషయాలను చర్చించేవాడు అందరికంటే కూడా గొప్ప నాస్తికుడు, పాషండుడు.

- సశేషం

# ద్వారకామాయి అనుభవమండపము

*శ్రీమతి ఎల్లంరాజు వసంత, హైదరాబాదు*

మొట్టమొదట మా అక్క ద్వారా నాకు శ్రీ సాయి లీలామృతము, శ్రీగురుచరిత్ర గ్రంథాలు పరిచయం అయ్యాయి. అప్పటినుంచి మేమందరమూ పారాయణ సంప్రదాయంలోకి అడుగుపెట్టాము. శ్రీ శిరిడీ సాయిబాబాగారు చాలా అద్భుతమైన అనుభావాలను మాకు ప్రసాదించారు.


ఒకసారి మాకు తెలిసిన వాళ్ళ అబ్బాయి పెళ్లి విషయంలో ఎవరినో ప్రశ్న అడగడానికి వెళ్తూ, నన్ను కూడా రమ్మన్నారు. నేను శ్రీ బాబాగారి పారాయణలు చేసుకోవడం మొదలు పెట్టిన తర్వాత అలాంటి విషయాల్లో నాకు నమ్మకం ఉండేది కాదు. తప్పని పరిస్థితిలో వాళ్ళతో బయలుదేరాను. వాళ్ళింట్లో బాబాగారి పటం ఉండేది. నేను వెళ్తు వెళ్తూ ఆ పటం వైపు చూసేసరికి అందులోంచి బాబా, “వెళ్ళావంటే జాగ్రత్త అన్నట్టు, వేలు చూపిస్తూ బెదిరిస్తున్నారు!” నాకు చాలా భయమేసింది. తరవాత అంతటి దర్శన భాగ్యం కలిగినందుకు అత్యంత ఆనందం కలిగింది. ఇది నా ప్రత్యక్ష అనుభవం.

మేము కొన్నాళ్ళక్రితం తాండూర్ లో ఉండేవాళ్ళం. అక్కడ సిమెంట్ ఫ్యాక్టరీలో మావారు ఉద్యోగం చేసేవారు. అప్పుడొక గొప్ప లీల జరిగింది. నాకు పారాయణ పూర్తిచేసిన ప్రతిసారీ కొంత దక్షిణ బాబా దగ్గర పెట్టడం అలవాటు. ఒకసారి, ‘ఎవరైనా బాబా రూపంలో వచ్చి ఈ దక్షిణ తీసుకుంటే బాగుండును’ అనిపించింది. మేము ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీ ఊరికి దూరంగా ఉండేది. అక్కడ సెక్యూరిటీ కూడా చాలా కట్టుదిట్టంగా ఉండేది. బైట వారిని లోపలికి రానిచ్చేవారు కాదు. కానీ అకస్మాత్తుగా ఒక రోజు ఆరుగురు మా ఇంటి దగ్గరికి వచ్చారు. వాళ్ళు కన్నడ, మరాఠీ కలిసిన భాషలో మాట్లాడుతున్నారు. మేము కొన్నాళ్ళు మావారి ఉద్యోగ రీత్యా గుల్బర్గా దగ్గరలో ఉన్న ఊరిలో ఉండేవాళ్ళం. అందువల్ల వారు మాట్లాడేది నాకు అర్థం అయ్యింది. “మేము ఔదుంబర్ వెడుతున్నాము, వండుకోవడానికి బియ్యం, వస్త్రాలు దానం చెయ్యండి” అని అడిగారు. వెంటనే నాకు బాబాగారి దగ్గర ఉంచిన దక్షిణ విషయం గుర్తుకొచ్చింది. వారు దత్త క్షేత్రానికి వెడతామంటున్నారు కనుక ఆ దక్షిణ వారికి సమర్పించాను. వాటితో పాటు బియ్యం, వస్త్రాలు కూడా సమర్పించాను. అదే సమయానికి మా కారు డ్రైవరు మావారిని ఫ్యాక్టరీ లో దింపి ఇంటికి వచ్చాడు. వాళ్ళు ఆ కారుని చూసి, “ఈ కారు ఐదు ప్రాణాలు కాపాడుతుంది” అని అన్నారు. మా డ్రైవరుకి కూడా తనకి సంబంధించిన కొన్ని సూచనలు చేశారు. నాకు ఆశ్చర్యం వేసింది – ‘కారు ప్రాణాలు కాపాడడం ఏమిటి? నేను సరిగ్గానే విన్నానా?’ అనుకున్నాను.

తర్వాత కొన్నాళ్ళకి మా అబ్బాయికి పెళ్ళయ్యింది. పెళ్లైన 16 రోజుల పండగ లోపలే మా అబ్బాయి, కోడలు, మా అక్క, వాళ్ళ అబ్బాయి కాకినాడ దగ్గర ద్రాక్షారామం బయలుదేరారు. ఇలా వెళ్తూ ఉండగా ఒక ట్రక్ వచ్చి మా కారుని కొట్టేసింది. ఆ కారు మూడు

ఫల్టీలు కొట్టి ఒక ఎలక్ట్రిక్ స్తంభాన్ని గుద్దుకొని ఆగింది. చూడడానికి వచ్చిన వాళ్లందరూ కారులోని వారందరూ చనిపోయివుంటారని అనుకున్నారు. కానీ డ్రైవరుతో సహా ఐదుగురికి ఎటువంటి అపాయం జరగకుండా, చిన్న చిన్న దెబ్బలతో క్షేమంగా బయటపడ్డారు. వెంటనే అందరినీ దగ్గరలో ఉన్న ఆసుపత్రికి తీసుకువెళ్లారు. కొద్దిపాటి వైద్యంతో అందరూ క్షేమంగా ఇంటికి చేరారు. మాకారుకి మాత్రం చాలా నష్టం వాటిల్లింది.. అప్పుడు ఇదివరకు ఔదుంబర్ వెడుతున్నామని చెప్పిన సాధువుల మాటలు గుర్తుకొచ్చాయి,,,మా కారు దెబ్బలు తిని, మా వాళ్లందరినీ కాపాడింది. శ్రీ బాబావారికి, ఆ రూపంలో వచ్చిన ఆ సాధువులకు కృతజ్ఞతాపూర్వక నమస్కారములు తెలియచేసుకున్నాను.

మొన్న ఈమధ్య మా ఆడబడుచుకి రావలసిన పింఛను విషయములో చాలా ఆసక్తికర సంఘటన జరిగింది. మా ఆడపడుచుగారి భర్త చనిపోవడంతో పింఛను గురించి దరఖాస్తు చేసుకున్నారు,,,కానీ పని జరగటం లేదు. మా వాళ్ళందరూ 'కొంచెం డబ్బు పెడితేనే కానీ పనులు జరగవు' అన్నారు. సరేనని ఆ ప్రయత్నం కూడా చేసాము. తన గురించి మేము శ్రీ సాయి లీలామృతము పారాయణ చెయ్యడమే కాకుండా తన చేతకూడా పారాయణ చేయించాము. నేను ఆన్లైన్ (online)లో మన సత్సంగాలలో పాల్గొంటాను. ఒకసారి,,,,ధర్మాచరణ అన్న విషయంపై కొంత చర్చ జరిగింది. అప్పుడు నేను మనవాళ్ళందరికి,,, మా ఆడపడుచు పింఛను విషయంలో కొంత డబ్బు ఇవ్వవలసి వచ్చిందని, అది అధర్మము అని తెలిసినా మన పనులు అవ్వడం కోసం ఇలా చేస్తూ వుంటాము. ధర్మాచరణ చాలా కష్టం కదా! అన్నాను. కొంత మంది తమ అభిప్రాయాలు, అనుభవాలు కూడా పంచుకున్నారు. తరవాత కొన్నాళ్ళకి,,, పింఛను మంజూరు కావడం లేదు కనుక, దాని నిమిత్తమై డబ్బు తీసుకున్న సదరు వ్యక్తి, తిరిగి మాకు ఆ డబ్బుని ఇచ్చేశాడు. మేము చాలా ఆశ్చర్యపోయాము. లంచం ఇచ్చినా పని కాని ఈరోజుల్లో, ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వడము మామూలు విషయం కాదనిపించింది. అంటే,,,అందరం కలిసి



సత్సంగాలు చేసుకోవడం,,,మన లోటుపాట్లను అందరితో కలసి మనస్ఫూర్తిగా చర్చించుకున్నందుకు ఇంతటి లీల జరిగిందేమో అని నాకు అనిపించింది. తరవాత కొన్నాళ్ళకి తనకి పింఛను కూడా మంజూరు అయ్యింది.

మాది చాలా పెద్ద కుటుంబం. మేము ఆరుగురు అక్క చెల్లెళ్లం, మాకు ముగ్గురు అన్నదమ్ములు. అందరమూ శ్రీ సాయి లీలామృతము, శ్రీ గురుచరిత్ర పారాయణ చేస్తాము. ఎవరికోసం వారే కాకుండా,,,మా కుటుంబంలో ఎవరికి సమస్య ఉన్నా అందరమూ వాళ్ళకోసం పారాయణ చేస్తాము. శ్రీ సాయి మాకు ఎన్నో అనుభవాలు ప్రసాదించారు .. ఎన్నో జీవితాలు నిలబెట్టారు ...

ఈ సందర్భంగా ఇంతటి గ్రంథాలను మాకు ప్రసాదించిన పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారికి, సమర్థ సద్గురు సాయినాథులవారికి, మా కుటుంబ సభ్యులందరి తరపున శతసహస్రకోటి కృతజ్ఞతా పూర్వక నమస్సులు తెలియచేసుకుంటున్నాను.●

# ఆచార్యుని అద్భుత లీలలు

*స్వర్గీయ శ్యాంప్రసాద్, మెట్టు*

మెట్టు గ్రామానికి చెందిన స్వర్గీయ శ్యాంప్రసాదుగారు పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారి వాత్సల్యం, వారి బోధనా పద్ధతి మరియు శిష్యుల పట్ల వారికున్న ప్రేమ కళ్ళకు కట్టినట్లు కనిపించే తన అనుభవాలను, అనుభూతులను ఈవిధంగా తెలియచేశారు--

నేను 6 వ తరగతి చదివే రోజుల్లో పూజ్యశ్రీ మాస్టరుగారితో పరిచయమైంది. మా నాన్నతో కలిసి పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరికి వెళ్ళేవాడిని.

## తపస్సు నుండి లేచాక ఏమి చేస్తావు?

నా చదువు పెద్దగా కొనసాగలేదు. కొన్నాళ్ళకి ఆధ్యాత్మికత మీద ఆసక్తి కలిగింది. జీవితం అంతా అలా గడపాలని నిర్ణయించుకుని పూజ్యశ్రీ మాస్టరుగారికి ఆ విషయం చెప్పాను. ఎక్కడికైనా దూరంగా వెళ్లి తపస్సు చేసుకుంటానని చెప్పాను. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు, "తపస్సునుంచి లేచాక ఏమి చేస్తావు?" అని అడిగారు. ఆ సంగతి ఆలోచించలేదని చెప్పాను. "చాపల్యాలు పోగొట్టుకోకుండా ధ్యానం చేస్తే కుదరదు. లోపల వున్న చెడ్డసంస్కారాలు తొలగించుకోవాలి. బలవంతంగా మనసుని ధ్యానంలో కూర్చోపెడితే మానసికంగా తేడా వచ్చిన సందర్భాలు కూడా వున్నాయి. వివేకము, వైరాగ్యంతో కూడిన అవగాహన వచ్చాక అప్పుడు జపధ్యానాదులు కుదురుతాయి" అని చెప్పుకుంటూ వచ్చారు. ఇంక ఆ ఆలోచన మానుకున్నాను.

## మందిర నిర్మాణ పరమార్థం

విద్యానగరులో బాబా గుడి శంకుస్థాపనయ్యాక పూజ్యశ్రీ మాస్టరుగారు మమ్మల్నందరినీ తలొక ఊరికి బాబా గుడికి చందా కోసం పంపించారు. పూజ్యశ్రీ మాస్టరుగారు కూడా కొన్ని ఊళ్ళకి వచ్చారు. మా మెట్టుకి కూడా వచ్చారు. మా గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లారు. "ఎందుకు స్వామీ, అంత శ్రమ?" అంటే, "ఒరేయ్ ప్రతివాళ్లకీ బాబా అనుగ్రహము, ఆశీస్సులు లభించాలిరా!" అని చెప్పేవారు. ఎవరు ఎంత ఇచ్చినా ఏమీ అనేవారు కాదు. కొంతమంది ఇవ్వకుండా ఏవేవో ప్రశ్నలు అడిగేవారు. వాటన్నిటికీ ఎంతో ఓర్పుగా సమాధానం చెప్పేవారు. చందా ఇచ్చినా ఇవ్వకపోయినా ఆయనలో ఏ మార్పు వుండేది కాదు. కొంతమంది, "ఈ ధనాన్ని గుడికి ఉపయోగించే బదులు ఎవరైనా పేదవాళ్ళకి ఉపయోగించవచ్చు కదా?" అని అడిగేవాళ్ళు. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు, "ఎవరికైనా ధనం ఇస్తే దుర్వినియోగం చేసే అవకాశం వుంటుంది. అదే గుడికి ఇస్తే ఎంతోమందికి బాబా దర్శనం వల్ల వాళ్ళ సంస్కారాలలో మార్పులు వచ్చి జీవితాలే మారే అవకాశం వుంటుంది" అని చెప్పేవారు.

## వెంకయ్య స్వామి లీల

విద్యానగరు బాబాగుడి శంకుస్థాపనకు ముందు మొట్టమొదటిసారి శ్రీవెంకయ్యస్వామి దర్శనానికి గొలగమూడి వెళ్లాను. అక్కడ భవిష్యత్తులో నేను

గురువుగారికి చేసుకోబోయే సేవకి సంబంధించిన లీల ఒకటి స్వామి చేశారు. ఏ మహాత్ముల దగ్గరకి వెళ్లినా వారికి నమస్కారం చేసుకుని కొంతసేపు ధ్యానం చేసుకుని రమ్మని పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పేవారు. అదేవిధంగా స్వామి దగ్గరికి వెళ్లిన వెంటనే నమస్కారం చేసుకుని, ఎదురుగా కూర్చుని కళ్ళు మూసుకున్నాను. వెంకయ్యస్వామి గట్టిగా, "ఏందయ్యా ఆయన అట్టా కూర్చున్నాడు. లేచి అటు ఇటు తిరగమను!" అన్నారు. అక్కడ నేను తప్ప ఎవరూ లేరు. స్వామి సేవకులు తలొక పని చేసుకుంటూ వున్నారు. నేను గబుక్కున లేచి నిలబడ్డాను. వెంటనే స్వామి, "ఏందయ్యా, లేచి తిరగమంటే అట్టానే నిల్చుండావే?!" అన్నారు. ఏదో రెండు మూడు సార్లు తిరిగి, 'ఊరికే అటూ ఇటూ తిరిగితే ఏం బాగుంటుంది? అదేదో స్వామి చుట్టూ తిరుగుదామ'ని స్వామికి, వారి ముందున్న ధునికి కలుపుకుని చుట్టూ తిరుగుతున్నాను. వెంటనే స్వామి, "ఏందయ్యా నేను అటూ ఇటూ తిరగమంటే, నా చుట్టూ ఎందుకయ్యా తిరిగేది?" అన్నారు. "ఇదేంటిరా బాబు, ఊరికే అటూ ఇటూ తిరిగితే ఏం బాగుంటుంది?" అనుకుంటున్నాను. కానీ నన్ను కూర్చోమని చెప్పలేదని అక్కడక్కడే తిరుగుతున్నాను. ఈలోగా స్వామిని వేరొక వూరికి తీసుకుపోవాలి కాబోలు, ఆయన కోసం బండి వచ్చింది. నేను కూడా వాళ్లందరితో బయలుదేరాను. స్వామి బండిలో వున్నారు. మేమందరం వెనుక నడుస్తున్నాము. మధ్యలో దారికి అడ్డంగా ఏవో కట్టెలున్నాయని కొంతసేపు బండి ఆపి అవి పక్కకి తొలగిస్తున్నారు. నేను అందరితోపాటు నిలబడి వున్నాను. స్వామి ఆ బండిలోనుంచి "ఏందయ్యా! తిరగమంటే నిలబడిపోయినావే?!" అన్నారు. సరేనని అక్కడక్కడే తిరుగుతున్నాను. మళ్ళీ బండి బయలుదేరింది. కొత్త కలిచేడు దగ్గర బండి ఆపి స్వామిని దింపారు. నేను గబగబా వెళ్లి మళ్ళీ చోటు దొరకదేమోనని స్వామి ఎదురుగా కూర్చున్నాను. వెంటనే స్వామి," ఏందయ్యా! నేను చెప్పేదేంది.. నువ్వు చేసేదేంది?" అన్నారు. ఇక లాభం లేదని మళ్ళీ లేచాను.

ఇంతకీ వెంకయ్య స్వామి ఆరోజు ఎందుకలా అన్నారో కొన్నిరోజుల తరవాత అర్థమైంది. స్వామి దర్శనం 1978 కి ముందు జరిగింది. 1978 లో విద్యానగర్ బాబా గుడి శంకుస్థాపన జరిగింది. అప్పటినించి గుడికి చందాల కోసం, తరవాత ప్రెస్ పనిమీద.... అలా గురువుగారి సేవలో 1990 దాకా తిరుగుతూనే వున్నాను. స్వామి దగ్గర జరిగిన విషయం తరవాత ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారితో చెప్తే, "వాళ్లకి అన్నీ తెలుస్తాయి కదరా!" అన్నారు.

## అనుభూతి ప్రదాత

విద్యానగరులో ఒకరోజు సత్సంగం పూర్తయి అందరూ వెళ్లిపోయాక నేనొక్కడినే కూర్చునివున్నాను. పూజ్యశ్రీ మాస్టరుగారు, "ఏమిట్రా అలా దిగాలుగా కూర్చున్నావ్?" అని అడిగారు. "ఏమిలేదు మాస్టారు!" అన్నాను. "ఏం కావాలి? చెప్పు! " అన్నారు. "మీరు అందరికీ ఏవేవో సాధనలు చెప్తున్నారు. రాత్రిపూట ఎక్కడికో పోయి తపస్సు చేయండని, లేకుంటే, అడవిలోకి పోండనీ.... ఇలా అందరికి ఒకొక్కటి చెప్తున్నారు. నాకేమీ చెప్పలేదని బాధగా వుంది" అన్నాను. "నా దగ్గర వున్నా నీకు అలాగే వుందా? సరే, నా ఎదురుగా కూర్చో!" అన్నారు. నేను అలాగే కూర్చున్నాను. ఏమైనా చెప్తారేమోనని పూజ్యశ్రీ మాస్టరుగారి వైపే చూస్తున్నాను. కాసేపటికి పూజ్యశ్రీ మాస్టరుగారు కనిపించకుండాపోయారు. నాలో "నేను" అన్నది కూడా తెలియకుండాపోయింది!! అలా ఎంతసేపు గడిచిందో తెలియలేదు. కొంతసేపటికి నాకు మళ్ళీ పూజ్యశ్రీ మాస్టరుగారు కనిపించసాగారు. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు, "ఎలా వుందిరా?" అని అడిగారు, "ఎలాగో వుంది మాస్టారు! ఇది అని తెలియడం లేదు!" అన్నాను. "అంతేరా కావలసింది, బాబా సేవ చేసుకో చాలు!" అన్నారు.

## తండ్రిని మించిన ప్రేమ

ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు, "ఒరేయ్, ఈ జేబు నీదిరా! నీకు ఎంత కావాలన్నా ఎప్పుడైనా తీసుకోవచ్చు" అన్నారు. నేను చాలా ఆశ్చర్యపోయాను. అంత పెద్ద మాట ఇంట్లో మన తండ్రి కూడా అనడు. అయితే ఇంకొక మాట కూడా అన్నారు. "తీసేటప్పుడు ఐదు రూపాయలో, పది రూపాయలో వుంచి మిగతావి కావలసినంత తీసుకో!" అని. ఇలా అన్నారు కదా అని నేను ఒకసారి ఒంగోలులో వున్నప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారి జేబులోనుంచి వంద రూపాయలు తీసుకున్నాను -- ఏమంటారో చూద్దామని. ఏమీ అనలేదు. అంతగొప్ప మనసు ఎవ్వరికైనా వుంటుందా?!

విద్యానగరులో యువకులందరికీ ఆధ్యాత్మిక శిక్షణనిచ్చి తీర్చిదిద్దితే, ఒంగోలులో గృహస్థులందరి జీవితాలను స్వాంతన పరచారు. ఒంగోలులో మాత్రమే కాకుండా యావత్ప్రపంచంలో అనేకమంది హృదయాలలో శాశ్వతస్థానం సంపాదించుకుని సమాధిరూపంలో విరాజిల్లే రాజాధిరాజయోగిరాజ పరబ్రహ్మ పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారికి శిరస్సు వంచి కృతజ్ఞతాపూర్వక ప్రణామములర్పిస్తున్నాను.

# మాతృదేవి స్మృతులు

16వ పేజీ తరువాయి

## అమ్మగారి చివరి ఆశీస్సులు

తరువాత శ్రీ సాయి సన్నిధి, శ్రీ సాయి లీలామృతము గ్రంథాలు కూడా నన్నే అనువాదం చేయమని పూజ్యశ్రీ అమ్మగారు నాకు అవకాశం ఇచ్చారు. అయితే ప్రతీసారీ అనువాదం చెయ్యబోయే గ్రంథాన్ని పూజ్యశ్రీ అమ్మగారి చేతులమీదుగా మాకు ఇవ్వడం జరిగేది. శ్రీ సాయి లీలామృతం గ్రంథానికి మాత్రం అమ్మగారు బయటకి రాలేని పరిస్థితుల్లో ఉండడం వల్ల శ్రీ ద్వారకబాబుగారు లోపలికివెళ్ళి పూజ్యశ్రీ అమ్మగారు ఇచ్చిన శ్రీ సాయి లీలామృతము గ్రంథం తీసుకొచ్చి నాకు ఇచ్చారు. అయితే నాకు ఇవ్వబడిన ఏ గ్రంథంలోనూ సంతకం చేయని అమ్మగారు శ్రీ సాయిలీలామృతము గ్రంథంలో తమ స్వహస్తాలతో సంతకం చేసి ఆశీస్సులు రాసి ఇచ్చారు. నాకు చాలా ఆనందమైంది, కానీ అదే వారి నుంచి తీసుకునే చివరి గ్రంథం అవుతుందని అప్పుడు నాకు తెలియలేదు. ఆ గ్రంథం అనువాదం పూర్తయ్యే సమయానికి అమ్మగారు శరీరం వదిలేసారు.

మేము అనువాదం చేసిన ఏ గ్రంథమైనా ముందుగా విద్యానగర్ వెళ్లి పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గర గ్రంథాన్ని ఉంచి, ఒక పేజీ వరకైనా పారాయణ చేసుకొని, తిరిగి ఒంగోలు వచ్చి సమాధి మందిరంలో వారికి చూపించి అక్కడ కొంత పారాయణ చేసి అప్పుడు నాగోలులో పూజ్యశ్రీ అమ్మగారికి సమర్పించుకోవడం మా ఆనవాయితీ! శ్రీ సాయిలీలామృతము గ్రంథం కూడా ఇదే వరుసలో జరిగి, ఒంగోలు నుంచి మేము గుమ్మళంపాడు రావడం జరిగింది. 2021 వ సంవత్సరం, మాస్టరుగారి జయంతి రోజు వచ్చాము. ఆ గ్రంథం చేత పట్టుకొని అమ్మగారి సమాధి ఎదురుగా నిల్చుంటే, నాకు లోపల ఏదో తెలియని వేదన...ఆ బాధని తట్టుకోవడం నా వల్ల కాలేదు. ఇక ఎంత బాధపడినా అమ్మని సశరీరంగా చూసే అవకాశం లేదని నన్ను నేను సంభాళించుకుని,,వారు నిత్యసత్యులు కనుక నేను వారిని చూడలేకపోయినా, వారు నన్ను ఎప్పుడూ కనిపెట్టి కాపాడుతూ వుంటారని ఆశిస్తూ, ఆ గ్రంథాన్ని అక్కడే సమర్పణ చేసుకుని మరలి వచ్చాను.

ఎక్కడో దూరాన ఉన్న నాకు ఇంతటి సేవను అనుగ్రహించి, కష్టమంతా వారు పడి, అంతులేని తృప్తిని నాకు ప్రసాదించిన పూజ్యశ్రీ అమ్మగారి పాదపద్మములకు శిరస్సువంచి కృతజ్ఞతాపూర్వక నమస్సులు అర్పిస్తున్నాను.●

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o. SRI MANGA BHARADWAJA TRUST**
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad - 500068, Phone: +91 7416041550
Branch Office : Kondalah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 8597233271

### శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ గురు చరిత్ర – శ్రీ సాయి లీలామృతము (బౌండ్) | ₹499.00 |
| శ్రీ గురు చరిత్ర | ₹249.00 |
| శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి | ₹149.00 |
| శ్రీ దత్తావతార మహాత్మ్యము | ₹75.00 |

### శ్రీ శిరిడీ సాయిబాబాపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతము | ₹249.00 |
| శ్రీ సాయి సన్నిధి | ₹199.00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము. | ₹119.00 |
| శ్రీ సాయినాథ పూజ | ₹49.00 |
| శిరిడీ హారతులు | ₹15.00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | ₹49.00 |
| శ్రీ సాయినాథ స్తవన మంజరి | ₹10.00 |
| సాయిని పూజించడం ఎందుకు? | ₹10.00 |
| సత్సంగము – భజన | ₹10.00 |
| సాయి సూక్తి – ఆచార్యవాణి | ₹20.00 |
| శ్రీ సాయి నిత్య సత్య వ్రతము | ₹20.00 |
| (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | |

### ఇతర మహాత్ముల గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ స్వామి సమర్థ | ₹75.00 |
| శ్రీ తాజుద్దీన్ బాబా | ₹75.00 |
| అవధూత శ్రీ వెంకయ్య స్వామి | ₹99.00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | ₹75.00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | ₹75.00 |
| శ్రీ ఆనందమయి అమ్మ | ₹75.00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | ₹99.00 |
| శ్రీ గురు సిద్ధారూఢ స్వామి | ₹99.00 |
| (రచన : శ్రీమతి శారదా వివేక్) | |
| అవధూత శ్రీ చివటం అమ్మ | ₹99.00 |
| (రచన : శ్రీమతి శారదా వివేక్) | |

### అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| ఏది నిజం? | ₹49.00 |
| మతం ఎందుకు? | ₹49.00 |
| విజ్ఞాన వీచికలు | ₹99.00 |
| పరిప్రశ్న | ₹119.00 |

### ధ్యాన సంబంధమైన గ్రంథములు

| | |
|---|---|
| ధ్యానయోగ సర్వస్వము | ₹99.00 |
| బుద్ధ ధ్యాన హృదయము | ₹49.00 |

### ఆధ్యాత్మికత – తత్వచింతనా పూర్వక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | ₹199.00 |
| ఆధ్యాత్మిక జాగృతి | ₹199.00 |
| (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | |

### ఇతర గ్రంథములు

| | |
|---|---|
| పురుషసూక్త రహస్యము | ₹49.00 |
| మనము – మన సంస్కృతి | ₹75.00 |

### పూజ్య భరద్వాజ గురుదేవులపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు | ₹149.00 |
| (రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | |
| భగవాన్ శ్రీ భరద్వాజ | ₹299.00 |
| (రచన : శ్రీమతి శ్రీదేవి) | |
| మహా పురుషుడు | ₹60.00 |
| (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –1 | ₹199.00 |
| (సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –2 | ₹199.00 |
| (సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | |
| ఆచార్య అమృత లేఖావళి | ₹199.00 |
| (సంకలనం : శ్రీ సి.థామస్ రెడ్డి) | |
| మరో నంద దీపం | ₹120.00 |
| మాస్టారు అమృత వాక్కులు | ₹99.00 |
| (రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | |

### బాలల కొరకు విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| బాలల సాయి లీలామృతము | ₹49.00 |
| (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | |
| బాలల సాయిసన్నిధి | ₹75.00 |
| (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | |
| బాలల శ్రీ గురు చరిత్ర | ₹75.00 |
| (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | |

### BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba The Master | ₹249.00 |
| Shri Guru Charitra | ₹149.00 |
| Supreme Master | ₹149.00 |
| Tajuddin Baba | ₹149.00 |
| Sai Baba and His Teachings | ₹149.00 |
| Children's Sai Baba The Master | ₹80.00 |
| *(Author: Smt. Adidam Vedavati)* | |

### BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sri Sai Baba (Hindi) | ₹249.00 |
| Sri Guru Charitra (Hindi) | ₹249.00 |
| Sri Sai Leelamruthamu (Kannada) | ₹249.00 |
| Sri Sainatha Prabodhamruthamu (Kannada) | ₹149.00 |
| Sri Guru Charitra (Kannada) | ₹199.00 |
| Sri Sai Sannidhi (Kannada) | ₹249.00 |
| Tibet Yogi Milarepa Charitra (Kannada) | ₹119.00 |
| Sri Swami Samartha (Kannada) | ₹119.00 |
| Sri Sai Leelamruthamu (Tamil) | ₹249.00 |
| Sri Guru Charitra (Tamil) | ₹299.00 |
| Sri Shirdi Sai Aartulu (Tamil) | ₹29.00 |
| Sri Sainatha Stavana Manjari (Tamil) | ₹20.00 |
| Sri Sai Leelamruthamu (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Odiya) | ₹299.00 |
| Sri Sai Sannidhi (Odiya) | ₹249.00 |
| Sri Swami Samartha (Odiya) | ₹75.00 |

నేను దర్శించిన మహాత్ములు

# శ్రీ పాకలపాటి గురువుగారు



## ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Postal Registration Number : Prakasam/2026-2028, Regd. No. APTEL/26/A0220



మే 11వ తేదీ సోమవారం నాడు తిథి ప్రకారము (వైశాఖ బహుళ నవమి) మాతృదేవి పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి ఆరాధనా మహోత్సవం సందర్భంగా శ్రీ అలివేలు మంగమ్మ దివ్య సన్నిధానములో గురుపుత్రిక శ్రీమతి వేదవతిగారు విశేష పూజ మరియు సత్సంగ ప్రవచనం చేశారు. భక్తులందరూ ఈ కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు

This periodical is published by Revuri Seshachala Sasidhar from Ongole on behalf of Ekkirala Vikramaditya, edited by Revuri Seshachala Sasidhar and printed by Janatha Offset Printers at Nirmal Nagar, Ongole".
[according to the Press and Registration of Periodicals (PRP) Act, 2023].